

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755





పుంగనూరులో టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు - రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న రామచంద్రారెడ్డి



పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కలికిరి మురళీమోహన్ సోమవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పార్టీ శ్రేణులు, కూటమిలోని ఇతర పార్టీల నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ర్యాలీలో పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తూ మురళీమోహన్ ముందుకు సాగారు.





పలమనేరులో టీడీపీ అభ్యర్థి అమరనాథరెడ్డి శుక్రవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో టీడీపీ బీజేపీ, జనసేన నేతలు భారీ స్థాయిలో పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందజేశారు.

పుంగనూరులో
పెద్దిరెడ్డి పని క్లోజ్

ప్రజలూ.. భయపడకుండా ఓటు వేయండి

మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి - అట్టహాసంగా టీడీపీ అభ్యర్థి చల్లా నామినేషన్

పుంగనూరు, ఏప్రిల్ 22: 'పుంగనూరులో పెద్దిరెడ్డి పని అయిపోయింది. ఈ జనమే అందుకు సాక్ష్యం' అని మాజీ సీఎం, బీజేపీ రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న ఆయన పుంగనూరు ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉద్వేగంగా ప్రసంగించారు. ర్యాలీలో భారీగా ఉన్న ప్రజలను చూపుతూ 'ఈ జనాన్ని చూసి పెద్దిరెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతాయి' అన్నారు. పెద్దిరెడ్డి పని క్లోజ్ అయిపోయిందంటూ.. 'బాయ్..బాయ్ పెద్దిరెడ్డి' అని కిరణ్‌కుమార్‌రెడ్డి పలుమార్లు నినాదాలు చేశారు. 'ఆయనకేమైనా పిచ్చికుక్క కరిచిందా? అన్నీ అబద్ధాలే చెబుతున్నాడు' అని వ్యాఖ్యానించారు. పుంగనూరులో అధికారాన్ని అడ్డం పెట్టుకుని పెద్దిరెడ్డి చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని, పాలు, మామిడి రైతులకు అతి తక్కువ ధరలు ఇచ్చి కోట్లు కాజేశారని కిరణ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు.



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, పక్కన చల్లా రామచంద్రారెడ్డి

ప్రమాణం చేస్తావా పెద్దిరెడ్డీ

'డీసీసీ పదవి కోసం పెద్దిరెడ్డి నా కాళ్లు పట్టుకున్నట్లు నేను కాణిపాకం, తరిగొండలో ప్రమాణం చేస్తా. ఆయన చేస్తాడా' అని ప్రశ్నించారు. సత్యసాయిబాబా బంగారు నేను కాజేసినట్లు చేసిన విమర్శలపై పెద్దిరెడ్డి నమ్మే అయ్యప్పస్వామిపై ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. పుంగనూరు నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో కెమెరాలు ఉంటాయని, పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని, ప్రజలు ఎవరికీ భయపడకుండా ఓట్లు వేసి పెద్దిరెడ్డిని ఇంటికి పంపాలని కోరారు. పుంగనూరులో టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపీగా తనకు ఓట్లు వేయాలని కోరారు. పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జరగనున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని, పెద్దిరెడ్డిని ప్రజలు శాశ్వతంగా ఇంటికి పంపడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ ఇన్‌చార్జి వెంకటరమణరాజు, రమేశ్‌రెడ్డి, మాధవరెడ్డి, శ్రీకాంత్, రామనాథంనాయుడు, విరూపాక్షి తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరుకు కేంద్ర బలగాలు

పుంగనూరు, ఏప్రిల్ 22: ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పుంగనూరుకు ప్రత్యేకంగా కేంద్ర సాయుధ బలగాలు రానున్నట్లు తెలిసింది. సోమవారం ఎస్పీ మణికంఠ కేంద్ర బలగాలు బస చేయడానికి స్థానిక అంబేడ్కర్ భవన్‌లోని గదులు, సమావేశ మందిరాలు, మరుగుదొడ్లు, మౌలిక వసతులపై ఆరా తీసి, పరిశీలించారు. పుంగనూరులో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార వైసీపీ నాయకులు ప్రత్యర్థులను నామినేషన్లు వేయకుండా దౌర్జన్యాలకు పాల్పడడం, నామినేషన్ పత్రాలు చించివేయడం, బలవంతపు ఏకగ్రీవాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి అధికంగా ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పుంగనూరులో ప్రశాంతంగా పోలింగ్ జరగడానికి ఇప్పటికే పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ, పటిష్ట పోలీస్ భద్రతకు చర్యలు తీసుకున్నట్లు సమాచారం, తాజాగా సుమారు 1000మంది కేంద్ర సాయుధ బలగాలు వస్తున్నట్లు తెలిసింది.



ఆర్వో కార్యాలయానికి నడుచుకుంటూ వెళుతున్న భువనేశ్వరి (ఫైల్ ఫొటో)

వైసీపీకి నిబంధనలు వర్తించవా?

- ఆర్వో కార్యాలయ ఆవరణలోకి ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ కారు
- నామినేషన్ దాఖలు
- నిబంధనలను గౌరవించి వంద మీటర్ల దూరం నుంచే నడిచొచ్చిన చంద్రబాబు సతీమణి భువనేశ్వరి

కుప్పం, ఏప్రిల్ 22 : పాలనాధికారం వైసీపీ నుంచి ఎలక్షన్ కమిషన్ చేతికి వచ్చినా అధికారుల తీరు మారలేదు. అధికార పార్టీ పట్ల స్వామి భక్తి చాటుకుంటూనే ఉన్నారు. కుప్పంలో మరోమారు ఈ విషయం నిరూపితమైంది. వైసీపీ ఎమ్మెల్సీ, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ తరఫున ఆయన సతీమణి దుర్గ సోమవారం నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చారు. ఆర్వో కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను పోలీసులు పక్కకు తీసేయగా, ఆమె కారు నేరుగా ఆర్వో కార్యాలయం గేటు వద్దకు చేరుకుంది. కాన్వాయ్‌లో వచ్చిన రెండవ కారు కూడా దాన్ని అనుసరించింది. ఆర్వో కార్యాలయ గేటును పోలీసులు దగ్గరుండి బార్లా తెరిచారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో మేలుకున్న అధికారులు ఆ రెండు కార్లను కాసేపటి తర్వాత గేటు బయటకు పంపారు.



ఆర్వో కార్యాలయ ఆవరణలో పార్క్ చేసి ఉన్న దుర్గ కాన్వాయ్‌లోని కార్లు

నిబంధనలు గౌరవించిన భువనేశ్వరి : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తరఫున ఆయన సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 19న నామినేషన్ దాఖలు చేశారు. భారీ ర్యాలీగా తరలివచ్చారు. ఈసీ నిబంధనలను గౌరవించి ఆర్వో కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే వాహనాన్ని ఆపేసి, నడుచుకుంటూ నామినేషన్ కేంద్రంలోకి వెళ్లారు.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

వైసీపీ ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ వాహనాన్ని ఆర్వో కార్యాలయంలోకి అనుమతించడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చెప్పారు. కార్యాలయ ఆవరణలోకి పోలీసులు ఎలా అనుమతిస్తారని నిలదీశారు. కుప్పంలో వైసీపీకి కొత్త చట్టం ఏదైనా అమలవుతోందా అని ప్రశ్నించారు.

నాలుగో రోజు 44 నామినేషన్లు

- పార్లమెంటుకు 7, అసెంబ్లీకి 37

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నాలుగో రోజైన సోమవారం 44 దాఖలయ్యాయి. ఇందులో పార్లమెంటు స్థానానికి 7, ఏడు అసెంబ్లీ స్థానాలకు 37 నామినేషన్లు అందాయి. దీంతో ఇప్పటివరకు అందిన మొత్తం నామినేషన్ల సంఖ్య 93కు చేరింది. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి వైసీపీ తరఫున రెడ్డప్ప, ఆయన సతీమణి రెడ్డమ్మ రెండు సెట్ల చొప్పున, కాంగ్రెస్ నుంచి చిట్టిబాబు, జాతీయ జనసేన నుంచి దుగ్గిరాల నాగేశ్వరరావు, నేషనల్ మహాసభ పార్టీ నుంచి జానకీ రామారావు ఒక్కో నామినేషన్ దాఖలు చేశారు. నగరికి ఇండిపెండెంట్‌గా నారాయణస్వామి మొదలి నామినేషన్ వేశారు. పలమనేరుకు అమరనాథరెడ్డి, ఆయన సతీమణి రేణుకారెడ్డి టీడీపీ నుంచి, వైసీపీ నుంచి వెంకటేగౌడ, ఇండిపెండెంట్లుగా బాషా, అరుణ్‌కుమార్, పవిత్రకావలి నామినేషన్లను అందించారు. కుప్పం నుంచి టీడీపీ తరఫున చంద్రబాబు నాయుడు, కాంగ్రెస్ నుంచి గోవిందరాజులు, వైసీపీ నుంచి కృష్ణ రాఘవ జయేంద్ర భరత్, మురళీధర్, భారతీయ ప్రజాగళ కళ్యాణ పక్షపాతి తరఫున అక్బర్, ఇండిపెండెంట్‌గా రామచంద్రప్ప నామినేషన్లు ఇచ్చారు. పుంగనూరుకు కాంగ్రెస్ నుంచి మురళీ మోహన్, టీడీపీ తరఫున చల్లా రామచంద్రారెడ్డి, చల్లా సుప్రియ, చల్లా పూజారెడ్డి, సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున జమీర్ ఒక్కో నామినేషన్ దాఖలు చేశారు. జీడీ నెల్లూరుకు అఖిల భారతీయ జనసంఘ్ నుంచి రామరాజు, టీడీపీ నుంచి రవికుమార్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా రాము, బహుజన సమాజ్ పార్టీ నుంచి భాస్కర్ నామినేషన్లు వేశారు. చిత్తూరుకు వైసీపీ నుంచి ఇందుమతి రెండు సెట్లు, కాంగ్రెస్ నుంచి తుకారాం, ఇండిపెండెంట్‌గా ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నుంచి కంచర్ల ప్రతిమ నామినేషన్లను అందించారు. పూతలపట్టుకు టీడీపీ తరఫున మురళీ మోహన్, వైసీపీ నుంచి సునీల్‌కుమార్, కాంగ్రెస్ తరఫున బాబు, జనసంఘ్ నుంచి కట్టమంచి విశ్వనాథ సాయి మోహన్, ఇండిపెండెంట్‌గా రాజా ఒక్కో నామినేషన్ వేశారు. బీఎస్పీ తరఫున నాగేశ్వర రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

17 నుంచి ఆరో స్థానానికి..

- పది ఫలితాల్లో బాలికలదే పైచేయి..!
- ఉత్తీర్ణత శాతం 91.28
- 30 పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు
- మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు
- రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు ఫీజు చెల్లింపునకు 30 వరకు గడువు



వీఎన్ రోషిణి

- వంద శాతం ఉత్తీర్ణతతో ఎయిడెడ్, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ ముందంజలో ఉండగా, 79.05 శాతం ఉత్తీర్ణతతో మున్సిపల్ స్కూల్స్ చివరి స్థానంలో నిలిచాయి. కాగా జిల్లాలో 159 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇందులో ప్రైవేటు పాఠశాలలు 83 ఉండగా, ప్రభుత్వ పాఠశాలలు 76 ఉన్నాయి.



ఫలితాలు వెల్లడిస్తున్న డీఈవో దేవరాజు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 22: జిల్లాల విభజన తర్వాత రెండోసారి సోమవారం విడుదలైన టెన్త్ ఫలితాల్లో జిల్లా ఆరో స్థానంలో నిలిచింది. గతేడాది 17వ స్థానంలో నిలవగా, ఈ ఏడాది ఆరో స్థానానికి ఎగబాకింది. ఎప్పటిలాగే ఈ ఏడాదీ బాలికలు సత్తా చాటారు. జిల్లా స్థాయిలో టెన్త్ ఫలితాలను డీఈవో దేవరాజు, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ చాముండేశ్వరి డీఈవో కార్యాలయంలో విడుదల చేశారు. స్థానిక కేశవరెడ్డి పాఠశాలల్లో చదువుతున్న వీఎన్ రోషిణి 600 మార్కులకు గాను 596 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. జిల్లాలో 20,939 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 19,113 మంది (91.28 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 1,826 మంది ఫెయిలయ్యారు. 10,146 మంది బాలికలకు గాను 9,517మంది (93.8శాతం)ఉత్తీర్ణులు కాగా 629 మంది ఫెయిలయ్యారు. 10,793 మంది బాలురుకు గాను 9,596 మంది (88.91శాతం) పాస్ కాగా 1,197 మంది ఫెయిలయ్యారు. 15,463 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాసు, 2,593 మంది సెకండ్ క్లాసు, 1,057 మంది థర్డ్ క్లాసులో ఉత్తీర్ణులయ్యారు.

మేనేజ్‌మెంట్ వారిగా ఫలితాల వివరాలు...

మేనేజ్‌మెంట్	విద్యార్థులు	పాసైనవారు	ఫెయిలైనవారు	శాతం
ఏపీ రెసిడెన్షియల్	112	112	0	100
బీసీ వెల్ఫేర్	121	121	0	100
ఏపీ మోడల్ స్కూల్స్	462	458	4	99.13
జిల్లా పరిషత్	12,156	10,920	1,236	98.83
సోషియల్ వెల్ఫేర్	478	472	6	98.74
ప్రైవేటు	4,872	4,756	116	97.62
కేజీబీవీ	299	290	9	96.99
ఎయిడెడ్	203	194	9	95.57
ట్రైబల్ వెల్ఫేర్	89	82	7	92.13
ప్రభుత్వ	1,350	1,078	272	79.38
మున్సిపల్	797	630	167	79.05
మొత్తం	20939	19113	1826	91.28

• మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరగనున్నాయి. మంగళవారం నుంచి ఈనెల 30వ తేదీలోపు ఎలాంటి రుసుమూ లేకుండా పరీక్షల ఫీజు చెల్లించాల్సి ఉంది. రూ.50 అపరాధ రుసుంతో మే ఒకటి నుంచి 23వ తేదీ వరకు ఫీజు చెల్లించే వెసలుబాటు ఇచ్చారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ పేపర్‌కు రూ.500, స్క్రిప్టు పేపర్ పొందడానికి పేపరు ఒక్కింటికి వెయ్యి రూపాయల మొత్తాన్ని మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ రాత్రి 11 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంది.

కుప్పంలో 6 నామినేషన్లు దాఖలు



చంద్రబాబు తరపున రెండో సెట్ నామినేషన్ దాఖలు చేస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, ఏప్రిల్ 22: కుప్పం నియోజకవర్గంలో సోమవారం వివిధ పార్టీలకు చెందిన ఆరుగురు అభ్యర్థుల నుంచి నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్సీ భరత్ తరఫున ఆయన సతీమణి దుర్గ నామినేషన్ దాఖలు చేశా రు. కాంగ్రెస్ అభ్యర్థిగా శాంతి పురం మండలానికి చెందిన ఎ.గోవింద రాజులు అలియాస్ ఆవుల గోపి నామినేషన్ వేశారు. చంద్రబాబు తరపున టీడీపీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి పీఎస్. మునిరత్నం రెండో సెట్ నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పి.రామచంద్రప్ప నామినేషన్ వేశారు. భారతీయ ప్రజాగళ కళ్యాణ పక్ష పార్టీ అభ్యర్థిగా అక్బర్ నామినేషన్ దాఖలు చేశారు. కాగా వైసీపీ రెబల్ అభ్యర్థిగా బి.మురళీధర్ అలియాస్ మురళి నామినేషన్ దాఖలు చేశారు.

వడగాడ్పులతో కూలీల కొరత

సోమల, ఏప్రిల్ 22: ఎండ తీవ్రతతో వ్యవసాయ పనులకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుతం సోమల మండలంలో టమోటా సాగు అధికంగా ఉంది. టమోటా సాగులో కర్రలు నాటడం, తీగెలు కట్టడం పనులకు కూలీలు అధికంగా కావాల్సి ఉంది. మండలంలో వడగాడ్పుల ప్రభావం, ఉక్కపోతతోపాటు ఎండలు 43 డిగ్రీలకు చేరుకోవడంతో పనులకు కూలీలు రావడం లేదు. దీంతో వారికి డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో కూలీలు ఉదయం 6గంటల నుంచి 11 గంటల వరకే పనులు చేస్తున్నారు. ఇదే సమయంలో వరి నూర్పిడి పనులు ప్రారంభ మయ్యాయి. కొందరు వరి నూర్పిడికి యంత్రాలు వినియోగిస్తున్నారు.

భూమికి రక్షణ కల్పించడం అందరి బాధ్యత

కల్లూరు, ఏప్రిల్ 22: సమస్త జీవకోటికి జీవనాధారమైన భూమిని రక్షించు కోవడం మనందరి బాధ్యత అని నేషనల్ గ్రీన్‌కోర్ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, గ్రీన్ మాస్టర్ వెంకటసిద్దులు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎన్‌జీసీ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి ధినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా తల్లిలాంటి భూమిని కాపాడుదాం - ప్లాస్టిక్ ను నివారిద్దాం అనే ప్లకార్డులతో విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. భూతాపం, కాలుష్య నివా రణ, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీవాణి, ఏఎస్ఐ రాజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి టాపర్ ధనరాణి



పెద్దపంజాణి, ఏప్రిల్ 22: పదవ తరగతి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. సోమవారం విడుదలైన పరీక్షా ఫలితాలలో శంకర్రాయల పేటలోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యుఆర్ పాఠశాల విద్యార్థిని ధనరాణి (579) మార్కులతో పెద్దపంజాణి మండలంలో ప్రథమస్థానంలో నిలచింది. ద్వితీయ స్థానంలో 574 మార్కులతో శంకర్రాయలపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని రుచితారెడ్డి, తృతీయస్థానంలో 570 మార్కులతో జేఎంజే పాఠశాల విద్యార్థి హర్షితారెడ్డి సాధించారు. పాఠశాలల వారీగా ఫలితాలు ఇలా ఉన్నాయి. ఎంజేపీఏపీబీసీడబ్ల్యుఆర్ పాఠశాల, అప్పినపల్లె, రాజుపల్లె, పెద్దవెలగటూరు, చిన్నేపల్లె ఉర్దూమీడియం పాఠశాలలకు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి.

పలమనేరులో 89 శాతం విద్యార్థుల ఉత్తీర్ణత



అమూల్య (577)

పలమనేరు, ఏప్రిల్22 : పలమనేరు మండలంలో పదో తరగతి పరీక్షల్లో 89 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ లీలారాణి తెలిపారు. మండలంలో మొత్తం718 మందికి గాను 581 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పలమనేరు బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎం.అమూల్య 577 మార్కులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రెడ్డిరాహుల్ 567 మార్కులతో తొలి రెండు స్థానాల్లో నిలిచారని వివరించారు.

పది పరీక్షా ఫలితాల్లో సత్తాచాటిన వి.కోట విద్యార్థులు

వి.కోట, ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాలో వి.కోట మండల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మండల పరిధిలోని 26 ప్రభుత్వ, 8 ప్రైవేటు పాఠశాలల నుంచి 1067 మంది పరీక్షలకు హాజరు కాగా వీరిలో 903 మంది ఉత్తీర్ణులై 84.6 శాతం ఉత్తీర్ణత సాధించారు. వి.కోట బాలికల ఉన్నత పాఠశాలలో మహాద 570 మార్కులతో అగ్రస్థానంలో నిలిచింది. కొంగాటం ఉర్దూ ఉన్నతపాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించింది. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గుడుపల్లెలో 89 శాతం ఉత్తీర్ణత

గుడుపల్లె, ఏప్రిల్ 22: గుడుపల్లె మండలంలో పది తరగతిలో 89 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో లక్ష్మయ్య తెలిపారు. మండలంలో 13 ప్రభుత్వ పాఠశాలల్లో 584 విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా వీరిలో 520 మంది ఉత్తీర్ణులైయారు. అత్యధిక మార్కులు సాధించిన వారు బిఆర్ కావ్యశ్రీ (587), ఎకె జాన్సీ హిమగాత్రి(575), విద్యాబాయ్(572), వీ.త్రిజా(565), వీ.పుష్పలత(565), కే.అనుష్క (558), జీ.మీనా(553) వీ.చిత్ర(550)లు ఉన్నారు.

కుప్పంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ



తంబిగానిపల్లెలో ఒక ఇంటిముందు దాడిచేస్తున్న యువకులు

కుప్పం, ఏప్రిల్ 22: కుప్పంలో సోమవారం సాయంత్ర ఇరు వర్గాలకు చెందిన యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కుప్పం కొత్త పేటకు చెందిన కొంతమంది యువకులు సోమ వారం సాయంత్రం కుప్పం -మల్లానూరు మార్గంలోని పారిశ్రామిక వాడకు ద్విచక్ర వాహనాలపై వెళ్లారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని తంబిగానిపల్లెకు చెందిన యువకులు అప్పటికే అక్కడున్నారు. రెండు వర్గాలకు చెంది యువకుల ద్విచక్ర వాహనాలు ఢీకొట్టుకోవడంతో ఘర్షణ చెలరేగింది. ఒక వర్గానికి చెందిన యువకులు భారీ సంఖ్యలో తంబిగానిపల్లె గ్రామంలో చొరబడి బీభత్సం సృష్టించారు. గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేశారు. ఇరు వర్గాలకు మధ్య తీవ్రమైన ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో తంబిగానిపల్లెకు చెందిన మణికంఠ, అరవింద్, శరవణ, వేలాయుధానికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరిన యువకులను టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పరామర్శించారు. దీనిపై ఎవరి నుంచీ ఫిర్యాదు అందలేదన్నారు.

సదుం మండలంలో 92 శాతం ఉత్తీర్ణత

సదుం, ఏప్రిల్ 22: సదుం మండలంలో సోమవారం వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో 92 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 181 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 165 మంది ఉత్తీర్ణులయ్యారు. స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థి ఆవుల మణి 589 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కృష్ణతేజ 572 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచాడు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విజయకేతనం

పుంగనూరు రూరల్, ఏప్రిల్22: పదో తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. పట్టణంలోని కొత్తయిండ్లు హైస్కూల్‌లో 227మందికి 186మంది ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. వీరిలో శైలేశ్(583), వెంకటేశ్(582), మోహన్‌కుమార్(574), విజయభాస్కర్(573), మండలంలోని అడవినాథనికుంట మోడల్‌పాఠశాలలో 77మందికి పరీక్షలు రాయగా 76మంది ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమా తెలిపారు. పాఠశాలలోనని సమీన్‌తాజ్(578), ధరణి(572(, అక్షయ(571) మార్కులు సాధించినట్లు తెలిపారు.

పదో తరగతి ఫలితాల్లో బాలికలదే హవా



రెడ్డిరాణి (577)

చౌడేపల్లె, ఏప్రిల్22: చౌడేపల్లె మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితల్లో బాలికలదే హవా అని ఎంఈవో కేశవరెడ్డి పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 418 మంది పరీక్షలు రాయగా 373 మంది పాసై 89 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మండలంలో ఏ.కొత్తకోటకు హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని రెడ్డిరాణి (577)మార్కులతో మొదటి స్థానం సాధించగా, చౌడేపల్లె హైస్కూల్‌కు చెందిన యశస్విని (563)మార్కులతో ద్వితీయ స్థానంలో, మర్రిమాకుల పల్లె హైస్కూల్‌కు చెందిన మానస (560) మార్కులతో మూడో స్థానంలో నిలిచిందని తెలియజేశారు.

ఉపాధ్యాయ దంపతులకు సత్కారం

గంగవరం, ఏప్రిల్ 22: ఈ నెల ఉద్యోగ విరమణ పొందుతున్న కీలపట్ల ఉపాధ్యాయులు పట్టాభిరామయ్య దంపతులను గంగవరం మండల ఎంఈఓలు, ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఎన్‌జీవో ఆనంద్‌బాబు, ఎంఈఓ-2 శ్రీనివాసులు, ప్రసాద్, కుమార్, రోషన్ ఆలీఖాన్, గిరిధర్, మూర్తి పాల్గొన్నారు.

ఎన్‌టీఏ నూతన కార్యవర్గం ఏర్పాటు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 22 : మండలంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల గౌరవాధ్యక్షుడిగా వీ.బాలాజి, అధ్యక్షుడిగా కృష్ణయ్య, ప్రధాన కార్య దర్శిగా ఏ.బాలాజి, ఉపాధ్యక్షులుగా లక్ష్మీదేవి, వినోద్, కోశాధికారిగా భాస్కర్, జిల్లా కౌన్సిలర్లుగా శివకుమార్, కే.బాలాజిలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

అట్టహాసంగా అమర్ నామినేషన్





అమరనాథరెడ్డి సమక్షంలో చేరిన 15వ వార్డు వైసీపీ నాయకులు, నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రేణుకారెడ్డి

పలమనేరు, ఏప్రిల్22 : మాజీ మంత్రి అమరనాథ రెడ్డి నామినేషన్ పర్వం సోమవారం అట్టహాసంగా సాగింది. తొలుత ఎద్దుల చెరువు వద్ద వెలసిన ఓం శక్తి ఆలయంలో పూజలు చేశాక అయ్యాకణ్ణువీధి, బజారు వీధి, జవులి వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. వి.విమహల్ వద్ద నామినేషన్ కార్యక్రమానికి విచ్చేసిన వేలాది మందిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తర్వాత ఆయన నామి నేషన్ వేశారు. ఆయన సతీమణి రేణుకారెడ్డి సైతం మరో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, పలమనేరు టీడీపీ సీనియర్ నాయకలు ఆర్వీ బాలాజి, చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షులు ఖాజాపీర్, పెద్దపంజాణి మాజీ ఎంపీపీ విజయ భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గంలోని అన్నిమండలాల టీడీపీ అధ్యక్షులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో మున్సిపాలిటీలోని 15వ వార్డుకు చెందిన పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో రియల్ ఎస్టేట్ వ్యాపారి మల్లికార్జున, హరియాదవ్, సిద్ధప్ప, శ్రీధర్, జాకీర్, కుప్పస్వామి ఉన్నారు. టీడీపీ నాయకులు అమరనాథరెడ్డి, అమ్ములు, సుదర్శన్, బాలాజీ, కోటి, సురేష్, నందకుమార్, కిరణ్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: మాజీ మంత్రి అమరనాథరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి బైరెడ్డిపల్లె టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

వి.కోట: మాజీ మంత్రి అమరనాథరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, ఏఎంసీ మాజీ ఛైర్మెన్ రామ చంద్ర నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, చౌడప్ప, బీసీ నేత నాగభూషణం, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, శబరీష్, నేతలు విశ్వనాథ్, హరి, జయప్ప, బాబు, సతీష్, నారాయణ స్వామి, సోము, రుహుల్లా, నాసీర్, షేక్‌ఉమ్మర్ తదితరులు తరలివెళ్లారు.

కమనీయం.. కాశీవిశ్వేశ్వరుడి కల్యాణోత్సవం



రామకుప్పం, ఏప్రిల్ 22: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉభయదారులు జ్యోతీనగరవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దర్శించుకుని అర్చనలు చేయించారు. మధ్యాహ్నం ఉత్సవర్లను మాడ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం తేజస్విని, సాగరిక తదితర చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. రాత్రి పార్వతీపరమేశ్వరుల పరిణయోత్సవం కనుల పండువగా సాగింది. రాత్రి కల్యాణ శోభితులైన స్వామి, అమ్మవార్లను మంగళవాయిద్యాలు, డప్పులహోరు, బాణసంచా వేడుకల మధ్య మాడ వీధుల్లో ఊరేగించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన వందలాది మందితో ఆలయాల వీధి జనసంద్రంగా మారింది.

పుంగనూరులో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం: ఎస్పీ



పుంగనూరులో జిల్లా ఎస్పీ మణికంఠ

పుంగనూరు, ఏప్రిల్22ప్ర పుంగనూరులో ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ మణికంఠ పేర్కొన్నారు. సోమవారం పుంగనూరులో నామినేషన్ ప్రక్రియ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం, అంబేద్కర్ భవన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పుంగనూరులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌బందోబస్తు, భద్రత, తనిఖీలు, ఎన్నికల కమిషన్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కర్ణాటక, తమిళనాడు నుంచి అక్రమ మద్యం రవాణా అరికట్టడం, సారాపై కఠిన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. రౌడీషీటర్లు, అల్లర్లుకు పాల్పడే వారిని బైండోవర్లు చేస్తున్నట్లు వివరించారు. ఆయన=వెంట మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, సీఐ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

పుంగనూరులో భారీ ర్యాలీ



చల్లాబాబుకు, నల్లారి కిరణ్‌కు క్రేన్‌తో పూలమాలలు వేస్తున్న అభిమానులు

పుంగనూరు, ఏప్రిల్22: చల్లా రామచంద్రారెడ్డి టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు సందర్భంగా స్థానిక పలమనేరు రోడ్డులోని బాలాజీ థియేటర్ నుంచి తూర్పుమొగసాల, ఎంబీటీరోడ్డు, ఇందిరాసర్కిల్, పాతబస్టాండ్, పోలీస్‌స్టేషన్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు వేలాదిగా హాజరయ్యారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డిలకు భారీ క్రేన్‌లతో పూలమాలలు వేసి బళ్లారి డ్రమ్స్‌తో స్వాగతం పలికారు. పుంగనూరు పసుపు మయంగా మారింది. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల నుంచి భారీఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు హాజరయ్యాయి

భారీగా పోలీసు బందోబస్తు

టీడీపీ నామినేషన్ సందర్బంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. చిత్తూరు ఎస్పీ మణికంఠ, పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, పుంగనూరు సీఐలు రాఘవరెడ్డి, రామకృష్ణారెడ్డిలు, సీఆర్పీఎఫ్, ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహించారు.

చల్లాబాబు విజయం ఖాయం



రొంపిచెర్లలో మాట్లాడుతున్న సుప్రియారెడ్డి

రొంపిచెర్ల, ఏప్రిల్ 22: పుంగనూరు నియోజకవర్గంలోని ప్రజాభిమానంతో టీడీపీ ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డి విజయం సాధించడం ఖాయమని ఆయన సతీమణి చల్లా సుప్రియారెడ్డి అన్నారు. సోమవారం ఉదయం టీడీపీ బీ-ఫారం తీసుకొని నామినేషన్ వేయడానికి పుంగనూరుకు వెళుతున్న చల్లాబాబుతో పాటు ఆయన సతీమణి సుప్రియారెడ్డి, కుమార్తె పూజారెడ్డి, అక్క వీణారెడ్డితో మరికొందరు కుటుంబ సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.

చల్లా నామినేషన్‌కు తరలిన టీడీపీ శ్రేణులు

చౌడేపల్లె: పుంగనూరులో చల్లా రామచంద్రారెడ్డి నామినేషన్‌కు చౌడేపల్లె నుంచి భారీగా టీడీపీ శ్రేణులు తరలివెళ్లాయి. టీడీపీ మండలాధ్య క్షులు గువ్వల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీపతిరాజు, పురుషోత్తమరాజు, బోయకొండ సుబ్బు, బోజనాలరెడ్డి, కల్యాణ్, వెంగలపల్లి రమణ, బీజేపీ నాయకులు చిన్నికిశోర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జండా ఎగురవేద్దాం



మాట్లాడుతున్న పారిశ్రామిక వేత్త పురుషోత్తమరాజు

పుంగనూరులో టీడీపీ జెండాను ఎగరవేద్దాం అని ప్రముఖ పారిశ్రామిక వేత్త పురుషోత్తమ రాజు పిలుపు నిచ్చారు. మండల టీడీపీ నాయకుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు సీఎం కాగానే జరిగే మంచిని ప్రజలకు వివరించాలని సూచించారు. ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని, ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, నాయకులు లక్ష్మీపతిరాజు, బోయకొండ సుబ్బు, ప్రదీప్‌రాజు, గిరిరాజు, అనిల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో ఆరుగురి నామినేషన్

పలమనేరు, ఏప్రిల్22 : పలమనేరు నియోజకవర్గం నుంచి శాశనసభకు పోటీచేసేందుకు సోమవారం ఆరుగురు నామినేషన్ వేశారు. ఇందులో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, ఆయన సతీమణి రేణుకారెడ్డి టీడీపీ అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ వైసీపీ తరఫున, స్వతంత్ర్య అభ్యర్థులుగా పలమనేరు మండలం కొలమాసనపల్లి పంచాయితీ కూరుమాయి గ్రామానికి చెందిన ఎస్.అరుణ్‌కుమార్, రామకుప్పం మండలం శివునికుప్పం గ్రామానికి చెందిన వి.పవిత్రకావలి, పలమనేరు గాంధీనగర్‌కు చెందిన కె.బాషా లు నామినేషన్ వేశారు. సోమవారం నాటికి మొత్తం 15 నామినేషన్‌లు దాఖలు అయ్యాయని ఆర్డీవో మనోజ్‌రెడ్డి తెలిపారు. కాగా ఎస్.అరుణ్‌కుమార్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. అయినా జనరల్ స్థానానికి పోటీ చేస్తుండడం విశేషం.

రామకుప్పంలో 98శాతం ఉత్తీర్ణత

17పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

రామకుప్పం, ఏప్రిల్ 17: రామకుప్పం మండలంలో పది పరీక్షల్లో 98శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తం 644మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 635మంది ఉత్తీర్ణులయ్యారు. మండల పరిధిలో మొత్తం 23పాఠశాలలుండగా 17 పాఠశాలల్లో 100 శాంతం ఉత్తీర్ణత నమోదైంది. విజలాపురం ఉన్నత పాఠశాలకు చెందిన అఫ్సానా 589, బీఎస్.స్వాతి 579, ఆయేషా 577 మండలంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

రొంపిచెర్ల టాపర్ ఫర్హానాబేగం



రొంపిచెర్ల, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రొంపిచెర్ల మండల టాపర్‌గా మోడల్ స్కూల్ విద్యార్థిని ఎం.ఫర్హానాబేగం (568) మండల టాపర్‌గా నిలిచింది. ద్వితీయ స్థానంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి పి.హబీబుల్లా (566), మూడవ స్థానంలో లిఖిత (560) మార్కులు సాధించారని ఎంఈవోలు ఇందిర, శ్రీనివాసులు తెలిపారు. మండలం 95 శాతం ఉతీర్ణతలో నిలిచింది.

సోమల టాపర్ సుహాన





సుహాన అంజూం(576), జాహ్నవి (566)

సోమల, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సోమల హైస్కూల్ విద్యార్థి ఎస్. సుహాన అంజూం 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. కందూరుకు చెందిన ఆర్.జాహ్నవి 566 మార్కులతో ద్వితీయ స్థానం సాధించింది. సోమల హైస్కూల్లో 67 మందికి 66 మంది ఉత్తీర్ణులై 99శాతం సాధించారు. సూరయ్యగారిపల్లె హైస్కూల్‌లో 28 మందికి 27మంది, నంజంపేట హైస్కూల్‌లో 59మందికి గాను 56మంది, పెద్దఉప్పరపల్లెలో 79 మందికి 74 మంది, కందూరు హైస్కూల్‌లో 74 మందికి 53 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కాగా మండల వ్యాప్తంగా 89.9శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శివరత్న తెలిపారు.

పుంగనూరులో చల్లా నామినేషన్

పుంగనూరు, ఏప్రిల్22: పుంగనూరులో టీడీపీ అభ్యర్థిగా చల్లా రామచంద్రారెడ్డి సోమవారం నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూధన్‌రెడ్డికి అందజేశారు. స్థానిక రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో చల్లాబాబు, ఆయన సతీమణి చల్లా సుప్రియా, ఆయన కుమార్తె చల్లా పూజారెడ్డి నామినేషర్లు దాఖలు చేశారు. వారి వెంట టీడీపీ నాయకులు రమేశ్‌రెడ్డి, వెంకటమునియాదవ్, సీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కాంగ్రెస్ అభ్యర్థి మురళీమోహన్‌యాదవ్, సోషల్‌డెమొక్రటిక్‌పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి జమీర్ నామినేషన్లు వేశారు. సోమవారం నాటికి 13 నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో మధుసూధన్‌రెడ్డి తెలిపారు

టీడీపీలో చేరిన విశ్రాంత డీఎస్పీ సుకుమార్

పుంగనూరు వాల్మీకి సంఘనాయకులు, విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు టీడీపీ అభ్యర్థి చల్లా బాబు సమక్షంలో టీడీపీలో చేరారు.

చల్లా బాబుపై 18కేసులు

పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిపై 18 కేసులు నమోదు చేసినట్లు ఎన్నికల ఆఫిడవిట్లో పేర్కొన్నారు. రొంపిచెర్ల, పుంగనూరు, సోమల, కల్లూరు, చౌడేపల్లె, మొలకలచెరువు, ముదివేడు, సైబరాబాద్ పోలీస్‌స్టేషన్లో కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

9 పాఠశాలల్లో 100 శాతం ఫలితాలు



ద్వితీయ స్థానంలో నిలిచిన హిందూశ్రీ

శాంతిపురం, ఏప్రిల్ 22 : పదో తరగతి ఫలి తాల్లో పేద విద్యార్థులు సత్తాచాటారు. మండలం లో 97.05 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని ఒక ప్రభుత్వ పాఠశాల, ఒక కేజీబీవీ, ఆదర్శ పాఠ శాల, బాలయోగి గురుకుల పాఠశాల, 15 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలో 779 మంది పదో తరగతి పరీక్షలు రాశారు. అందులో 756 మంది పాస్ అయ్యారు. 13 మంది మాత్రమే ఫెయిల్ అయ్యారు. ఆదర్శ పాఠశాలలో చదువుతున్న మీనా 600 మార్కులకు గాను 582 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. శాంతిపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని హిందూశ్రీ 577 మార్కులతో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. శివరామ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పుష్ప 574 మార్కులు, బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థులు కౌశిక్ 574 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. పవన్‌కుమార్ 573 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచాడు. తుమ్మిశి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వికాస్ 572 మార్కులతో ఐదో స్థానంలో నిలిచాడు. మండలంలోని కెనమాకులపల్లె, సోగ డబల్ల, శివరామపురం, సీ.బండపల్లె, దండి కుప్పం, 64పెద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మాదనపల్లె కేజీబీవీ, కడపల్లె బాలయోగి గురుకుల పాఠశాల, తుమ్మిశి ఆదర్శ పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించాయి. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందిచారు.

94.57 శాతం ఉత్తీర్ణత సాధించిన పులిచెర్ల

కల్లూరు: పులిచెర్ల మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులు 94.57 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకలతాతయ్య తెలిపారు. 350 మందికి 331 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

ఆటో సహా నిందితుడి అరెస్టు

వి.కోట, ఏప్రిల్ 22: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఆటోను పోలీసులు సీజ్ చేశారు. సీఐ లింగప్ప సిబ్బందితో సోమవారం ఉదయం జవ్వనిపల్లె ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో వాహన తనిఖీ చేపట్టారు. ఆటోలో 11 కేసుల కర్ణాటక మద్యం ఉండగా గుర్తించారు. ఆటోను నడుపుతున్న వసంత్‌ను అదుపులోకి తీసుకోగా మరో నిందితుడు పరారయ్యాడు. సుమారు రూ. 66500 విలువ గల మద్యంతో పాటు ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

బాబును గెలిపిద్దాం.. ప్రగతి సాధిద్దాం



రాళ్లబూదుగూరులో వృద్ధుడిని ఓటు అడుగుతున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, ఏప్రిల్ 22 : చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకుని కుప్పం నియోజకవర్గంలో ప్రగతిని సాధిద్దాం... అంటూ మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగ కమిటీ కన్వీనర్ డాక్టర్ సురేష్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షులు విశ్వనాథ్‌నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయ కుమార్ ప్రచారం సాగించారు. సోమవారం రాళ్ల బూదుగూరు పంచాయతీ కేంద్రంలో మండల టీడీపీ నేతలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి ఆర్ఎస్ మణిల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. బిడ్డల భవిష్యత్తు కోసం చంద్రబాబును ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రసాదరావును గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, చలపతిస్వామి, యూనిట్ ఇన్‌చార్జిలు గోపాల్, రుద్రప్ప, నారాయణస్వామి, రాళ్లబూదుగూరు టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ పుష్ప, మాజీ జడ్పీటీసీ శకుంతల, మండల మహిళ అధ్యక్షులు శ్యామల, ప్రధాన కార్యదర్శి రూప, జనసేన నాయకులు కిషోర్, నవీన్, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో 92శాతం ఉత్తీర్ణత

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్షాఫలితాల్లో బైరెడ్డిపల్లె మండ లంలోని పాఠశాలలు 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో సాయిలీల తెలిపారు. ఇందులో కమ్మనపల్లె గురుకుల పాఠశాల, కస్తూర్బా పాఠశాల, ఆదర్శ పాఠశాల, బైరెడ్డిపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. కడపపత్తం జడ్పీ ఉన్నత పాఠశాల 98శాతం, పెద్దచెల్లారగుంట 95శాతం, బైరెడ్డిపల్లె బాలికోన్నత పాఠశాల 90శాతం, తీర్థం పాఠశాల 90శాతం, మూలతిమ్మేపల్లె 89శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

వైసీపీకి ఆదిలోనే హంసపాదు



వైసీపీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న వసనాడు మురళి

కుప్పం, ఏప్రిల్ 22: రెబల్ అభ్యర్థి మురళి రూపంలో వైసీపీకి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ఆ పార్టీ రెబల్ అభ్యర్థిగా కుప్పం మండలానికి చెందిన బి.మురళీధర్ నామినేషన్ వేశారు. ఈయన వసనానాడు మాజీ సర్పంచ్, టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ నుంచి పోటీ చేసి గెలిచారు. అయితే పార్టీలో తగినంత గౌరవం దక్కకపోవడంతో చాలా కాలంగా అసంతృప్తిగా ఉన్నారు. ఏకంగా ఎమ్మెల్సీ భరత్‌ను వ్యతిరేకిస్తూ సోషల్ మీడియాలో కొంతకాలంగా పోస్టులు పెడుతూ వస్తున్నారు. నాలుగైదు నెలలుగా వైసీపీ నుంచి రెబల్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తూ వచ్చారు. చివరకు అనుకున్నట్లే మురళీధర్ ఆ పార్టీ తరఫున రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. మొదటి నుంచి పార్టీలో ఉంటూ టీడీపీ హయాంలో సైతం ఎదురొడ్డి గెలిచిన మురళి లాంటి వారికి పార్టీలో గౌరవం, గుర్తింపు లేకపోవడంతో చాలాకాలంగా వైసీపీ కార్యకర్తల్లో అసంతృప్తి ఉంది. దీంతో వారు ఆలోచింపజేసే అవకాశం ఉంది. నియోజకవర్గంలో సంఖ్యాపరంగా నాల్గవ స్థానంలో ఉన్న గాండ్ల సామాజిక వర్గానికి చెందిన మురళితో వైసీపీకి ఎంతోకొంత నష్టం చేస్తుందన్న చర్చ నడుస్తోంది.

విద్యార్థిని అదృశ్యం

పుంగనూరు రూరల్, ఏప్రిల్22: పుంగనూరుకు చెందిన ఓ విద్యార్థిని అదృశ్యమైంది. బాలిక మదన పల్లెలోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం పుస్తకాల కొనుగోలు కోసమని ఇంటినుంచి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి చేరలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తాయిలాలపై ప్రత్యేక నిఘా

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 22 : ఉచిత తాయిలాల కింద పంపిణీకి సిద్ధం చేసిన నగదు, లిక్కర్, చీరలు, వాచీలు, టీవీ, కుక్కర్, ఇతరత్రా వస్తువుల పంపిణీపై ప్రత్యేక నిఘా ఉంచాలని, పట్టుబడినప్పుడు వీడియో గ్రాఫర్‌తో, పోలీసు అధికారులతో కలిసి వీడియోగ్రఫీ చేయించాలని కలెక్టర్ షన్మోహన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎన్నికల విధులు కేటాయించిన అధికార బృందాలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఆరు చొప్పున ఎఫ్ఎస్‌టీ, ఎస్ ఎస్‌టీ బృందాలు పనిచేయాలన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన యూడీసీ సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చౌడేపల్లె, ఏప్రిల్ 22 : ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన యూడీసీ రెడ్డెప్పరెడ్డిని రీజనల్ డీఎంహెచ్‌వో రత్నకుమారి సస్పెండ్ చేసినట్లు డాక్టర్ పూజ పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ స్థానిక పీహెచ్‌సీలో యూడీసీగా పనిచేస్తున్న రెడ్డెప్పరెడ్డి సీఎం జగన్ సిద్ధం సభలకు వెళ్లి సదుం అమ్మగారిపల్లెలో ఆయనతో సెల్ఫీ దిగారని, దీనిపై ఈనెల 11న ఆంధ్రజ్యోతిలో వార్త రావడంతో పుంగనూరు రిటర్నింగ్ అధికారి ఫిర్యాదుతో స్పందించిన కడప రిజనల్ డీఎంహెచ్‌వో రత్నకుమారి ఆయన్ను సస్పెండ్ చేసినట్లు డాక్టర్ పూజ వివరించారు.

తిరుపతి వర్తమానం



కూటమి కలయికతో స్పీడు తగ్గిన ఫ్యాను

సిటింగ్ ఎమ్మెల్యేకు బదులు ఆయన తనయుడు పోటీచేయడం, టీడీపీ కాకుండా దాని మిత్ర పక్షమైన జనసేన నుంచి చిత్తూరు సిటింగ్ ఎమ్మెల్యే బరిలో నిలబడటంతో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నిక ఈసారి ఆసక్తిదాయకంగా మారింది. గత ఎన్నికల్లో స్వల్ప ఆధిక్యతతో గట్టెక్కిన వైసీపీ ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఈదఫా తాను పోటీ చేయకుండా వారసునిగా కుమారుడు, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ అభినయరెడ్డికి పార్టీ టికెట్ సంపాదించుకున్నారు. వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుపతి బరిలో నిలిచారు.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● ఏకతాటి పైకి ఎన్డీఏ కూటమి నాయకులు ● వైసీపీ నుంచి పెద్ద ఎత్తున చేరికలు ● ఆ పార్టీలో అవినీతి ఆరోపణల గుబులు

● పవన్ పర్యటనతో వైసీపీలో గుబులు

కొద్దిరోజుల క్రితం ఆరణి అభ్యర్థిత్వంపై తిరుపతి ఎన్డీఏ కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ)లోని అసమ్మతి పోరు తనకు ఉపకరిస్తుందని వైసీపీ ఆశలు పెట్టుకుంది. కానీ టీడీపీ, జనసేన అధినేతలు స్వయంగా జోక్యం చేసుకుని పార్టీ నాయకులలోని అసంతృప్తిని చల్లార్చారు. పవన్ కల్యాణ్ పర్యటనతో అసమ్మతి పటాపంచలైంది. దీంతో వైసీపీలో గుబులు పట్టుకుంది. ఐదేళ్లుగా జరిగిన స్థానిక, ఉప, టౌన్ బ్యాంకు ఎన్నికలన్నింటిలోనూ ఫేక్ ఓట్లపైనే ఆధారపడ్డ అధికార పార్టీ, సార్వత్రిక ఎన్నికల్లోనూ అదేపంథాలో నడవాలన్న పన్నాగం సిద్ధం చేసుకున్నా ఈసారి బెడిసికొట్టింది. తన తండ్రికి ఆఖరి ఏడాది దక్కిన టీటీడీ చైర్మన్ పదవితో అడ్డగోలుగా శ్రీవారి నిధులు దుర్వినియోగమయ్యామనే విమర్శలు అభినయ్ విజయాన్ని ప్రభావితం చేస్తాయని పార్టీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు అయిష్టంగానే ప్రచారంలో పాల్గొంటున్నట్టుగా కనిపిస్తోంది. ఫలితంగా అధికార వైసీపీలో మునుపటి ఉత్సాహం కనిపించడంలేదు.

అలుపెరగని ప్రచారం : జనసేన అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఏడు పదుల వయస్సులోనూ ఎండను సైతం లెక్కచేయకుండా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఉదయం వాకర్స్‌తో కలిసి నడుస్తూ ప్రచారం చేస్తూ ఆతర్వాత కూటమి నాయకులతో ఇంటింటా తిరుగుతున్నారు. గాజు గ్లాసు గుర్తును ప్రజల చెంతకు తీసుకుపోతున్నారు. సొంత నిధులతో మసీదులు, ఈద్గా మైదానాల ఆధునీకరణ చేస్తామని రంజాన్ పర్వదినం సందర్భంగా ఆయన ప్రకటించి ముస్లిం సోదరుల అభిమానాన్ని కూడగట్టుకున్నారు. కూటమి నాయకులందరూ ఏకతాటి మీదకు రావడంతో తిరుపతిలో రాజకీయ వాతావరణం పూర్తిగా మారిపోయింది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే, నియోజవకర్గ ఇంచార్జి సుగుణమ్మ, జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్‌తో పాటు టీడీపీ నేతలు ఊకా విజయకుమార్, బేబీ శ్రీనివాస్ తదితరులు మూకుమ్మడిగా ప్రచారంలో కదలడంతో కూటమి శ్రేణుల్లో సంబరం నెలకొంది. టీడీపీ సీనియర్ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి (పెద్దబ్బ) వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

చేరికలతో కూటమిలో ఉత్సాహం

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత వైసీపీ నేతలు అన్నా రామచంద్రయ్య, అన్నా రామకృష్ణయ్య సోదరులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. కార్పొరేటర్లుగా ఉన్న వారి ఇద్దరు కుమార్తెలు కూడా ఆ పార్టీనుంచి బయటకు వచ్చేశారు. జనసేన, టీడీపీలో నిత్యం చేరికలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొలకల మల్లిఖార్జున్ ఇటీవల పవన్ సమక్షంలో జనసేనలో చేరి నగరంలో భారీ ర్యాలీకూడా నిర్వహించారు. మరో యువనాయకుడు పాటకం వెంకటేష్ కూడా జనసేనలోకి చేరబోతున్నట్లు తెలుస్తోంది.

వామపక్షాల బలమేంతో...

ఇండియా కూటమిలో తిరుపతి అసెంబ్లీ సీటు సీపీఐకి దక్కింది. ఇక్కడ వామపక్షాల నేతలు వైసీపీ ఎమ్మెల్యేతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతుంటారన్న విమర్శలు ఉన్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థి సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళీతో పాటు వామపక్ష నేతలు వైసీపీ నేతలపై భూకబ్జాలు, దౌర్జన్యాలు, అవినీతి వంటి అనేక ఆరోపణలపై పల్లెత్తి మాట అన్న దాఖలాలు లేవు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం వెనుక భారీ అవినీతి జరిగిందని లోకమంతా కోడై కూసినా టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై వీరు ప్రశ్నించిందిగానీ, ఖండించిందీ లేదు. టీటీడీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేశారంటూ కరుణాకరరెడ్డిని సన్మానాల్లో ముంచెత్తిన నాయకులు ఆయన కుమారుడిపై ఎలా పోరాడుతారో అని జనం అనుకుంటున్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నగరి ఏప్రిల్22: నగరి దళితవాడ ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు చంద్రారెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీచేశారు. ఏప్రిల్ 18వ తేదీన సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు వచ్చాయి. ఏప్రిల్ 8న నగరి పట్టణ పరిధిలోని కీళపట్టులో మంత్రి రోజా భర్త సెల్వమణితో కలిసి ప్రచారంలో పాల్గొనడంతో 'గురూ ఎన్నికలకోడ్ వుంది' అన్న ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.

మరో ఐదు మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి..

మండుతున్న ఎండలు ● అత్యధికంగా నిండ్రలో 44 డిగ్రీలు నమోదు



నిర్మానుష్యంగా గాంధీసర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 22: జల్లావ్యాప్తంగా ఎండల జోరు కొనసాగుతోంది. మూడు నాలుగు మండలాలు మినహా మిగిలిన చోట్ల ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు పైగా రికార్డు అయింది. నిండ్రలో 44, ఎస్ఆర్‌పురం 43.7, పులిచెర్ల 43.4, గుడుపల్లె 42.7, పుంగనూరు 42.4 డిగ్రీలు నమోదు కావడంతో ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయి. అలాగే తవణంపల్లె 43, నగరి, విజయపురంలలో 42.6, సోమల 42, చిత్తూరులో 41.5, గుడిపాల 41.3, ఐరాల, కార్వేటినగరం, చౌడేపల్లె, పాలసముద్రం, రొంపిచెర్ల 41.2, బంగారుపాళ్యం 41.1, గంగాధరనెల్లూరు, గంగవరం, సదుం 41, కుప్పం 40.9, పెద్దపంజాణి 40.8, శాంతిపురం, వీకోట 40.5, వెదురుకుప్పం 40.3, యాదమరిలో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.







ధ్వంసమైన డ్రిప్ సిస్టమ్ - ఏనుగులు తొక్కేసిన బీన్స్, అరటి, వేరుశెనగ



ఎస్.గొల్లపల్లెలో ఏనుగుల స్వైరవిహారం

ధ్వంసమైన డ్రిప్‌సిస్టమ్, తోటలు

రామకుప్పం, ఏప్రిల్ 22: మండలంలోని పంద్యాలమడుగు పంచాయతీ ఎస్.గొల్లపల్లె గ్రామ సమీప పొలాల్లో ఆదివారం రాత్రి ఏనుగుల మంద స్వైరవిహారం చేసింది. నాలుగు ఏనుగులు పంటలను తిన్నంత తిని, మిగతావి ధ్వంసం చేశాయి. సీ.జీ.గంట్లప్పగౌడుకు చెందిన పొలంలో డ్రిప్ సిస్టమ్‌ను ధ్వంసం చేశాయి. రైతులు రవికుమార్, జీ.గంట్లప్పగౌడు, మురుగేష్‌లకు చెందిన దోస, రాగి, అరటి తోటలను నాశనం చేశాయి. ఈ విషయమై అటవీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.

కొండంత అభిమానం

అమర్ నామినేషన్ ఫీజుకోసం దాచుకున్న సొమ్ము అందజేసిన చిన్నారులు



హుండీని అమరనాథరెడ్డికి అందజేస్తున్న గీతిక, షాలిని (ఫైల్ ఫొటో)

పలమనేరు, ఏప్రిల్22 : మాజీ మంత్రి అమరనాథరెడ్డి నాలుగు నెలల క్రితం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా గంగవరం మండలం మేలుమాయి పంచాయతీ గుండ్లపల్లి గ్రామానికి వెళ్లారు. జయరాం రెడ్డి ఇంటికెళ్లగా ఆయన ఇద్దరు కుమార్తెలు గీతిక, షాలిని తాము హుండీలో పొదుపు చేసుకున్న మొత్తాన్ని అమర్‌కు అందజేశారు. 'ఈ మొత్తాన్ని నామినేషన్‌కు వినియోగించుకోండి అంకుల్' అని చెప్పడంతో ఆయన ముగ్ధుడయ్యారు. అందులోని రూ.4,701లను తన నామినేషన్ దరఖాస్తు సొమ్ముకు వినియోగించుకుని మరోసారి వారి అభిమానాన్ని గుర్తు చేసుకున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.38 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.38 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ప్రకటించింది. ఆదివారం 77,366 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 24,375 మంది తలనీలాలు సమర్పించారు.

తెప్పలపై కోదండరాముడి విహారం



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 22: కోదండరాముడి తెప్పోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆలయంలోని మండపంలో స్వామివారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సీతారాముల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా రామచంద్ర పుష్కరిణికి తీసుకొచ్చారు. రెండోరోజు స్వామివారు ఏడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఇతర అధికారులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



తన్మయి (592 మార్కులు), దివ్య (588 మార్కులు), హారిక (586 మార్కులు), కిరణ్‌కుమార్ (587), జాస్మిన్, సంజన, గీతేష్, ఆవుల మణి, మీనా, వెంకటేశ్, శైలేశ్

కమ్మనపల్లె గురుకుల విద్యార్థినుల ప్రభంజనం

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కమ్మనపల్లె గురుకుల పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపారు. ఈ పాఠశాలలో 78మంది విద్యార్థినులు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులై వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శోభ తెలిపారు. తన్మయి 592 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. దివ్య 588, హారిక 586, తనుశ్రీ 585, అమృత 584 మార్కులు సాధించారు. పరీక్షలు రాసిన 78మంది విద్యార్థినుల్లో 70మంది విద్యార్థినులు 500 పైగా మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శోభ వెల్లడించారు. అలాగే బైరెడ్డిపల్లె మండలం కడపనత్తం పాఠశాలలో కిరణ్‌కుమార్ 587 మార్కులు సాధించాడు. ● రామకుప్పం మండలం విజలాపురం ఉన్నత పాఠశాలకు చెందిన అఫ్సానా 589లతో మండల టాపర్‌గా నిలిచింది. ● పులిచెర్ల మండలంలోని కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.జాస్మిన్586 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. ఎల్లంకి వారిపల్లి విద్యార్థిని కే.సంజన 584 మార్కులతో రెండవస్థానం సాధించింది. కల్లూరు విద్యార్థి ఎం.గీతేష్ 583 మార్కులతో మూడవ స్థానంలో నిలిచాడు. ● సదుం మండలంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థి ఆవుల మణి 589 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. ● శాంతిపురం మండల ఆదర్శ పాఠశాలలో చదువుతున్న మీనా 582 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ● పుంగనూరులోని కొత్తయిండ్లు హైస్కూల్‌కు చెందిన శైలేశ్ (583), వెంకటేశ్ (582) మార్కులు సాధించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



బిందుసాయి, యశ్వంత్, స్వాతి

చిత్తూరు (సెంట్రల్): జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 585కు పైగా మార్కులతో ప్రతిభ చాటారు. ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టి.బిందుసాయి 587, కార్వేటినగరం ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన యశ్వంత్ 588, ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లెమిట్ట ఉన్నత పాఠశాలకు చెందిన కె.స్వాతి 586 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

అండగా ఉంటాం

సలీమా దంపతులకు నారా భువనేశ్వరి భరోసా



బాధితురాలు సలీమాకు ధైర్యం చెబుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఏప్రిల్ 22: వైసీపీ అల్లరి మూకల దాడిలో గాయపడి, కుప్పం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సలీమా దంపతులను సోమవారం సాయంత్రం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పరామర్శించారు. వారితో నారా భువనేశ్వరి ద్వారా ఫోన్‌లో మాట్లాడించారు. భయపడవద్దని, టీడీపీ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ చంద్రబాబు నామినేషన్ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్నారన్న అక్కసుతో రామకుప్పం మండలం 89-పెద్దూరు గ్రామానికి చెందిన నస్రూన్‌తోపాటు ఆయన భార్య సలీమాపై వైసీపీ అల్లరి మూకలు విచక్షణా రహితంగా దాడిచేసి గాయపరిచారని చెప్పారు. వైసీపీ అరాచకాలకు త్వరలోనే చెక్ పెడతామని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దౌర్జన్యకారులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పబ్బలచేనుమిట్టలో తాగునీటి సమస్య



ఖాళీ బిందెలతో గ్రామస్తుల నిరసన

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 22: మండలంలోని ఎగువకమ్మకండ్రిగ పంచాయతీ పబ్బలచేనుమిట్ట గ్రామంలో రెండు రోజులుగా తాగునీటి సమస్య నెలకొందని గ్రామస్తులు పేర్కొన్నారు. పంచాయతీ బోరు నుంచి వచ్చేనీరు రాకపోవడంతో గ్రామస్తులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేశారు. తాగునీటికోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసన్నకుమారి

పూతలపట్టు, ఏప్రిల్ 22: అధికారులు తాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించే విషయంలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాగునీటి సమస్యపై రోజువారీ నివేదికను తనకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ కుమారి, జడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

బాడుగకు
ఓటేరు దగ్గర 20 వెడల్పు, 45 పొడవు గల రూము గోడౌన్ / ఆఫీసుకు బాడుగకు ఇవ్వబడును సంప్ర. : 98491 73046
AJT - 187163

PLOTS FOR SALE
నాయుడుపేట నుండి 4 K.M దూరంలో 140 ఎకరాల హై వెంచర్‌లో తక్షణమే గృహ నిర్మాణానికి అనువైన తుడా అప్రూవల్ ప్లాట్లు కలవు. 1S.q.Ft 375 రూ. మాత్రమే. సంప్ర. 99660 66111
AJT- 6293

ఫ్లాట్స్ ఫర్ సేల్
నేషనల్ హైవే అనుకొని తిరుపతి IIT, IISEER దగ్గర అయోధ్య టౌన్‌షిప్ నందు అతితక్కువ ధరకే ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు కలవు. డైరెక్ట్ ఓనర్. 95027 74175 / 79959 92114
AJT-6298

WANTED
Immediate requirement of staff in Navayuga Mutually Aided Co operative Society Limited as a Advisor age limit 25 yrs and above womens and bank retired employees are given prerioty minimum salary 10K to 30K job location Tirupati (urban & rural).
Phone. 99760 24365, 83286 57347,
Web : navayugamacs.com
AJT-6299

WANTED
Teachers for all subjects (Nursery to VII Grade) Principals & Pro's. RK's Veeksha The School, Tirupati. Ph : 77998 84561, 62, 63, 64, 96424 24383
AJT - 6300

TOURS & TRAVELS
తేదీ: 15/05 గోవా టూర్ 7 రో॥ 9 వేలు, తేదీ: 25/05 కేరళ యాత్ర 7 రో॥ 9 వేలు, 2x2 లగ్జరి బస్సు, టీ, టిఫిన్, శాఖాహార భోజనం. సంకల టూర్స్, తిరుపతి, 77308 10126.
AJT- 179933

వరుడు కావలెను
■ యాదవ / రెండోపెళ్లి / 30 / B.Tech / 5"3 / red / అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. అన్ని కులాల వారి పెళ్లి సంబంధాల కొరకు సంప్ర॥ తోట రవినాయుడు, మధుపల్లవి మ్యారేజస్, ఒంగోలు, సెల్: 9392192193
AJO-183912

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 176988

కావలెను
★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 7075656208
AJV_182884

WANTED
Wanted Teachers Pre Primary, Primary, Higher for All subjects, Hostel wardens, P.E.T, Computer faculty, Attractive salary,S.N. Puram, TIRUPATI - 92908 98331, 70138 81383.
AJT - 6303


VEHICLES FOR SALE
▸ TOYOTA INNOVA 2.5V Model - 2010 AP 39 KL 6710 వాహనము తేది: 26-4-2024 న ఉదయం 10.30 లకు అమ్మబడును. వివరాలకు అరుణా ఫైనాన్స్ లిమిటెడ్. సెల్ : 9133734102, 8885122360
AJB-100

క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, తద్వ్యతి మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి

జన చైతన్యం



కండువా గోలేంట్రా బాబు





నూర్‌బాషాకు కండువా కప్పుతున్న వైసీపీ నేతలు

గ్రామాల్లో కాస్త పలుకుబడి ఉన్న టీడీపీ నేతలు కనిపిస్తే చాలు.. వైసీపీ కండువా వేసేస్తున్నారు. ఇలా రామకుప్పానికి చెందిన నూర్‌బాషాకు రెండు సార్లు కండువా కప్పారు. అలాగే, ఇందిరానగర్‌కు చెందిన ఓ వ్యక్తి మసీదులో ప్రార్థన ముగించుకుని ఇంటికి వస్తుండగా వైసీపీ నేతలు అటుగా ప్రచారం చేస్తూ వచ్చారు. వెంటనే నేతలు ఆ 65 ఏళ్ల వ్యక్తికి తమ పార్టీ కండువా కప్పేశారు. ఆ ఫొటోలను వాట్సప్ గ్రూపుల్లో వైరల్ చేశారు. ఇలాంటి అనుభవం చాలామందికి ఎదురవుతోంది. 'మా కుటుంబమంతా టీడీపీనే. ఈ ఫొటోలు చూసి ఇంట్లోవాళ్ల ఇదేంటని అడుగుతున్నారు. బలవంతంగా కండువా వేశారని చెప్పుకోవాల్సి వస్తోంది' అంటూ పలువురు పేర్కొంటున్నారు. ఈ కండువాల గోలేంట్రా బాబూ అంటూ వీరంతా తలలు పట్టుకుంటున్నారు.

- రామకుప్పం

పోలింగ్ బూత్ @1400 ఓట్లు

● మీకు తెలుసా?



ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేది గరిష్ఠంగా 1400 మంది ఓటర్లే. ఎందుకంటే.. ప్రతి కేంద్రంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌లు ఈ మూడు ఒకదానికొకటి అనుసంధానంగా పని చేస్తాయి, ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్‌మిషన్)లకు అనుసంధానంగా ఉండే వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైవబుల్ పేపర్ అండ్ ట్రయల్)లో కాగితాన్ని పొందుపరుస్తారు. అది 1450 స్లిప్పులను మాత్రమే ముద్రిస్తుంది. బ్యాటరీతో పనిచేసే వీవీప్యాట్‌లోని డిస్‌ప్లేలో ఓటు ఎవరికి వేశామన్నది కనిపిస్తుంది. అందులో 50 వరకు కాగితం, స్లిప్పులు, ఓటింగ్‌రోజు మాక్‌పోలింగ్ ప్రక్రియకు వాడతారు. ఇదిపోను 1400 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు.

- చిత్తూరు కలెక్టరేట్

సీన్ 1



ఎక్కడ: రామకుప్పం మండలం రాజుపేట
ఎప్పుడు: ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేది
కార్యక్రమం: హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువకు కృష్ణా జలాలు విడుదల ప్రారంభోత్సవం
ప్రారంభోత్సకులు: ముఖ్యమంత్రి జగన్

జగన్నాటకం!

నవ్వులపాలైన హంద్రీ-నీవా నీటి విడుదల డ్రామా

సీన్ 2



ఎక్కడ: రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువకు నీటి విడుదల ప్రదేశం
ఎప్పుడు: ఫిబ్రవరి 27
కార్యక్రమం: సీఎం నీళ్లు విడుదల ప్రారంభోత్సవం చేయడానికి పెట్టిన గేటు తొలగింపు
నిర్వాహకులు: హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు

సీన్ కట్ చేస్తే..



వారం రోజుల తర్వాత: నీళ్లు పారకనే ఎండిపోయిన హంద్రీ-నీవా కాలువ
ప్రత్యక్ష సాక్షులు: కుప్పం నియోజకవర్గ ప్రజలు
బట్టబయలు చేసింది : ప్రతిపక్షాలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా.

అవును.. ఎన్నికల్లో లబ్ధికోసం ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన కుప్పం దాకా శ్రమించి హెలికాప్టర్‌లో వచ్చి మరీ రామకుప్పం మండలం రాజుపేట వద్ద ఆడిన హంద్రీ-నీవా కాలువకు కృష్ణా జలాలు విడుదల ప్రహసనం డ్రామా అని, తర్వాత రెండు మూడు రోజులకే తేలిపోయింది. వారం తర్వాత చూస్తే కాలువలో అసలు నీటిని వదిలిన జాడలే కనిపించలేదు. రామకుప్పం మండలంలో మూడు చెరువులకు నీటిని వదలామన్నారు కానీ, అవిప్పుడు ఎండిపోయి బోరుమంటున్నాయి. కుప్పం నియోజకవర్గ పరిధిలో కాలువ పొడవు 139 కిలోమీటర్లు, నింపాల్సిన చెరువులు 54. గమ్యస్థానం కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువు. ప్రస్తుతం కాలువలో చుక్క నీరు లేని దుస్థితి.



నాటకమాడింది ఇలా

ఫిబ్రవరి 26వ తేదీన సీఎం జగన్ కుప్పం పర్యటనకు శాంతిపురం మండలం పరిధిలో బహిరంగ సభను నిర్వహించడమే కాక, హంద్రీ-నీవా కాలువ ప్రారంభోత్సవం పేరుతో నాటకానికి తెరలేపారు. పుంగనూరు రిజర్వాయర్‌నుంచి వి.కోటకు తీసుకొచ్చిన నీటిని అక్కడినుంచి నిరంతరాయంగా పంప్ చేయించి, నిల్వ ఉంచి ప్రారంభోత్సవం రోజున గేటును తెరచి ప్రారంభోత్సవం చేసినట్లు కలరింగ్ ఇచ్చారు. నీటి విడుదల పేరుతో జగన్ పైకెత్తిన ఇనుప గేటును మరుసటి రోజునే అధికారులు తరలించుకు వెళ్లి, విమర్శలు రావడంతో తిరిగి ఏర్పాటు చేయడం ఇది నాటకమనడానికి ప్రత్యక్ష నిదర్శనం. ఆ తర్వాత టీడీపీ శ్రేణులే కాదు, పలువురు సామాన్యులు కూడా ఎండిపోయిన కాలువలోకి వెళ్లి, వీడియోలు చేసి, ఫొటోలు దిగి, ధర్నాలు చేసి జగన్నాటకాన్ని ఎండగట్టారు. మొదట్లో ఏవో కుంటిసాకులతో వివరణలు ఇవ్వబోయిన రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు తర్వాత కిమ్మనకుండా ఉండిపోయారు. వైసీపీ నేతలైతే కొన్నిరోజులు ప్రతి విమర్శలు చేసి, తర్వాత పూర్తిగా ఎండిపోయిన కాలువ కళ్లముందు కనిపిస్తుండడంతో ఏమనలేక కిక్కురుమనడం లేదు.

- కుప్పం

సిరా చుక్క కత



ఎన్నికల్లో ఓటు వేశాక పోలింగ్ కేంద్రంలో ఓటరు చూపుడు వేలిపై సిరా చుక్క గుర్తుగా పెడుతుంటారు. దీంతో సదరు ఓటరు మరో ఓటు వేయడానికి వీలుండదు. దొంగ ఓట్ల కట్టడికి ఎన్నికల కమిషన్ ఎప్పుడో రూపొందించిన నిబంధన ఇది. ఈ సిరాగుర్తు 72 గంటల పాటు చెరిగిపోదు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా సాధ్యం కాదు. మైసూరుకు చెందిన మైసూరు పెయింట్స్ అండ్ వార్నిష్ అనే పరిశ్రమ ఈ ఇంకును తయారు చేస్తోంది. 1962 నుంచి దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఈ సిరానే ఎన్నికల కమిషన్ ఉపయోగిస్తోంది. ఈ సిరాలో 7.25 శాతం సిల్వర్, నైట్రేట్ కలపడం వల్ల అంత తొందగా చెరిగిపోదని నిపుణులు చెబుతారు.

- చిత్తూరు కలెక్టరేట్

వేపంజేరి ● ముగిసిన చాప్టర్

మారుమూల గ్రామమైన వేపంజేరి కేంద్రంగా 1955లో నియోజకవర్గం ఏర్పాటైంది. ఇందులో గంగాధరనెల్లూరు, గుడిపాల, పెనుమూరు, పూతలపట్టు మండలాలతోపాటు చిత్తూరు మండలంలోని కొన్ని పంచాయతీలుండేవి. 1967 వరకు జనరల్.. తర్వాత రిజర్వు నియోజకవర్గంగా మారింది. 1955లో ఎస్సీ చెంగల్రాయనాయుడు (స్వతంత్ర), 1962లో జి.ఎన్.పట్టాభిరెడ్డి (స్వతంత్ర), 1967, 1972లో మునస్వామప్ప (కాంగ్రెస్), 1978లో బంగ్లా ఆర్ముగం (జనతా), 1983లో తలారి రుద్రయ్య (టీడీపీ), 1985, 1989లో గుమ్మడి కుతూహలమ్మ (కాంగ్రెస్), 1994లో ఆర్.గాంధీ (టీడీపీ), 1999, 2004లో కుతూహలమ్మ (కాంగ్రెస్) గెలుపొందారు. ఈమె మంత్రిగా, డిప్యూటీ స్పీకరుగా పనిచేశారు. 2009 నాటి నియోజకవర్గాల పునర్విభజనతో.. ఈ నియోజకవర్గంలోని గంగాధరనెల్లూరు, పెనుమూరు మండలాలు గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో.. పూతలపట్టు మండలం పూతలపట్టు నియోజకవర్గంలో కలిసింది. వేపంజరి అసెంబ్లీ సెగ్మెంటు హోదా కోల్పోయింది.

- గంగాధరనెల్లూరు

పుంగనూరు అరాచకాలకు కేరాఫ్‌గా మారింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వచ్చాక రాజకీయ ప్రత్యర్థులపై దౌర్జన్యాలు, దాడులు, పోలీసు కేసులు ఎక్కువయ్యాయి. భూ తగాదాలతో సామాన్యులూ ఇబ్బంది పడుతున్నారు. వీటినే ఈ ఎన్నికల్లో ఆయన ప్రత్యర్థులు రాజకీయ ప్రచారాస్త్రాలు వాడుకుంటున్నారు. కూటమి పార్టీల సహకారంతో గెలుపొందేందుకు టీడీపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది.

- పుంగనూరు

పుంగనూరు వర్తమానం

పెద్దిరెడ్డి అరాచకాలే ప్రత్యర్థుల ప్రచారాస్త్రాలు

● ప్రశాంత పుంగనూరే వీరి ఎన్నికల నినాదం
● ఎంపీగా కిరణ్ పోటీతో బలపడుతున్న టీడీపీ



రాష్ట్రంలోని కీలక నియోజకవర్గాల్లో పుంగనూరు ఒకటి. ఈ ఎన్నికల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి(వైసీపీ), చల్లా రామచంద్రారెడ్డి(టీడీపీ), రామచంద్రయాదవ్ (బీసీవై) తలపడుతున్నారు. 2009 వరకూ పుంగనూరు టీడీపీ కంచుకోట. టీడీపీకి పెద్దదిక్కుగా ఉన్న మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డి కన్నుమూయడం, వీరి సొంత మండలం పెద్దపంజాణి పలమనేరులో కలవడంతో అమరనాథరెడ్డి అక్కడికి వెళ్లారు. పీలేరు నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు రావడం.. టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న నేతలు, పార్టీ శ్రేణులను బలవంతంగా తనవైపు తిప్పుకొన్నారు. దీంతో 2009 ఎన్నికల నాటికి చాలా బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అనంతరం 2014, 2019 ఎన్నికల్లోనూ గెలుపొందిన ఆయన.. రెండు పర్యాయాలు మంత్రి కావడంతో ప్రత్యర్థులను రాజకీయంగా అణగతొక్కారు. చాలామందిని నయాన భయాన తనవైపు తిప్పుకొన్నారు. మిగిలిన వారిపై దౌర్జన్యాలు, అరాచకాలు, పోలీసు కేసులతో వేధింపులు ఎక్కువయ్యాయి. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ దాదాపు వెయ్యి మందిపై కేసులు నమోదు చేయించారు. మందలాది మందిని జైలుకు పంపారు. మరోవైపు టీడీపీ తరపున 2009, 2014లో వెంకటరమణరాజు.. 2019లో అనీషారెడ్డి పోటీ చేయగా.. ఈ ఎన్నికల్లో చల్లా రామచంద్రారెడ్డి బరిలో నిలిచారు. పెద్దిరెడ్డి సారథ్యంలో వైసీపీ శ్రేణులు పాల్పడిన అరాచకాలను ఈయన ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. వీటికి ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోంది. జనసేన, బీజేపీ జత కట్టడంతో టీడీపీ శ్రేణులకు మరింత ఉత్సాహాన్నిచ్చాయి. సూపర్ సిక్స్ పథకాలను జనంలోకి తీసుకెళ్తున్నారు. చల్లాబాబు గ్రామాల్లో తిరుగుతూ పలుచోట్ల వైసీపీ నేతలు, శ్రేణులను టీడీపీలో చేర్చుకుంటున్నారు.

ప్రజలను చైతన్యపరుస్తూ..

మంత్రి కుటుంబ కంపెనీ నిర్మిస్తున్న ప్రాజెక్టుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించలేదని, ఎన్జీటీ రూ.100కోట్లు జరిమానా విధించడం, ఇసుక, మట్టి తరలింపు, కొండలు, గుట్టలు కరిగిపోవడం, ప్రాజెక్టు నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వకపోవడం, అక్రమకేసులు, దౌర్జన్యాలను ప్రత్యర్థులు ప్రచారాస్త్రాలుగా ఉపయోగిస్తున్నారు. ప్రశాంత పుంగనూరు, రౌడీయిజం అణచివేత నినాదాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. మంత్రికి చెందిన శివశక్తి డెయిరీ, పీఎల్ఆర్ ఫుడ్స్ పండ్ల పరిశ్రమల ద్వారా రైతులకు గిట్టుబాటు ధరల్లేక తీవ్రంగా నష్టపోతున్నారనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళుతున్నారు.

చల్లా బాబుపై వైసీపీ దాడులు

గతేడాది సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన చల్లా రామచంద్రారెడ్డిపై వైసీపీ శ్రేణులు రెండుచోట్ల దాడులకు పాల్పడి కార్లు ధ్వంసం చేశారు. గతేడాది ఆగస్టు 4న పుంగనూరు మీదుగా చంద్రబాబునాయుడు చిత్తూరు వెళుతున్న సందర్భంగా టీడీపీ శ్రేణులపై పోలీసుల లాఠీచార్జి వల్ల జరిగిన గొడవల్లో చల్లా బాబుతో పాటు 498మంది నాయకులు, కార్యకర్తలపై హత్యాయత్నం తదితర కఠినమైన సెక్షన్లతో కేసులు పెట్టి అరెస్ట్ చేశారు. పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా వ్యవహరించిన 1000మందిపై పోలీసు కేసులు ఉండగా పలువురిపై రౌడీషీట్లు కూడా తెరిచారు. వీటన్నింటినీ ప్రచారాల్లో ప్రస్తావిస్తున్నారు.

బీసీవై నేత పోరాటం

పుంగనూరు బరిలో ఉన్న బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ పెద్దిరెడ్డి ఆగడాలపై బలంగా బాణాలను సంధిస్తున్నారు. తనపై జరిగిన హత్యాయత్నం, దౌర్జన్య దమనకాండను ఈ బీసీ నేత కేంద్ర హోమంత్రి అమిత్‌షాకు నివేదించి వైప్లస్ కేంద్ర భద్రత పొందారు. పెద్దిరెడ్డిని లక్ష్యంగా పోరాడుతున్న తనపై 45కేసులు పెట్టించిన తీరును, నియోజకవర్గంలో అరాచకాలపై గళం విప్పుతున్నారు. పాడి, పండ్ల రైతులను మంత్రి దోపిడీ చేస్తున్నారని ప్రజలకు వివరిస్తున్నారు.

కిరణ్ పోటీతో కొత్త ఉత్సాహం


పెద్దిరెడ్డి దీర్ఘకాల ప్రత్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండటం పుంగనూరులో టీడీపీకి కలసివస్తోంది. ఇది టీడీపీ శ్రేణులకు ధైర్యాన్నిస్తోంది. పుంగనూరు అభివృద్ధి మ్యానిఫెస్టోతో కూటమి నేతలు ముందుకు వెళుతున్నారు.

అన్నీ మంత్రికేనా?

నియోజకవర్గంలో చిన్న పని నుంచి పెద్ద కాంట్రాక్టు పనుల వరకు మంత్రి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ కంపెనీ చేస్తోంది. దీంతో వైసీపీలోని కాంట్రాక్టర్లకు పనులు లేకుండా పోయాయి. వీరంతా అసంతృప్తితో ఉన్నారు. కొందరికి మాత్రం భవన నిర్మాణ కాంట్రాక్టులు దక్కాయి.

హ్యాట్రిక్ కొట్టింది ఒక్కరే

● పలమనేరు చరిత్ర



తొలినాళ్లలో పంచాయతీగా ఉన్న పలమనేరు అంచెలంచెలుగా ఎదిగింది. 2004లో మున్సిపాలిటీగానూ, దశాబ్దం క్రితం పోలీసు సబ్‌డివిజన్‌గా, మూడేళ్ల కిందట రెవెన్యూ డివిజనల్ కేంద్రంగా రూపుదిద్దుకుంది. 1978 నుంచి ఈ నియోజకవర్గాన్ని 31 సంవత్సరాలు ఎస్సీలకు రిజర్వు చేశారు. ఇక్కడ నుంచి మూడుసార్లు టీడీపీ పక్షాన ఎన్నికైన డాక్టర్ పట్నం సుబ్బయ్య ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడుల క్యాబినెట్‌లో పనిచేశారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా గెలిచి రెండేళ్ల తరువాత టీడీపీ లో చేరిన అమరనాథరెడ్డి పరిశ్రమల శాఖ మంత్రిగా ప్రాతినిథ్యం వహించారు.

నియోజకవర్గం ఏర్పడిన సంవత్సరం: 1951
ఇప్పటిదాకా జరిగిన ఎన్నికలు: 15

వీరే ఎమ్మెల్యేలు

1952- రామబ్రహ్మం, (కాంగ్రెస్)
1955- ఎ. రత్నం, (కాంగ్రెస్)
1962 - కుసిని నంజప్ప(కాంగ్రెస్)
1967- టి.సి. రాజన్ (స్వతంత్ర పార్టీ)
1972- ఎం.ఎం. రత్నం(కాంగ్రెస్)
1978- ఎ రత్నం(కాంగ్రెస్)
1983- ఈ.ఆంజినేయులు (టీడీపీ)
1985,1989,1994- డాక్టర్ పట్నం సుబ్బయ్య (టీడీపీ)
1999- డాక్టర్ ఎం. తిప్పేస్వామి (కాంగ్రెస్)
2004- లలితకుమారి (టీడీపీ),
2009- అమరనాథరెడ్డి (వైసీపీ),
2014 - అమరనాథరెడ్డి (టీడీపీ),
2019- ఎం. వెంకటేగౌడ(కాంగ్రెస్)

మండలాలు : పలమనేరు, గంగవరం, వి.కోట,పెద్దపంజాణి,
మున్సిపాలిటీ : పలమనేరు

ఓటర్ల సంఖ్య: 2,66,739
పురుషులు: 1,32,020
స్త్రీలు: 1,34,719
ఇతరులు: 0

- పలమనేరు

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

మేయర్ వార్డులోనూ మౌలిక వసతుల్లేవు

వైసీపీని వీడి టీడీపీలో చేరిన సుమారు 400 కుటుంబాలు




టీడీపీలో చేరిన వైసీపీ నేతలు, కుటుంబాలతో గురజాల జగన్మోహన్, ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గురజాల ప్రతిమ

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 22: మేయర్ వార్డులోనూ కనీస మౌలిక వసతులు కల్పించలేదని ఆరోపిస్తూ నగరంలోని సుమారు 400 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. సోమవారం నగరంలోని బీవీ రెడ్డికాలనీలో ఉన్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నివాసంలో ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. నగరంలోని 3, 39 వ డివిజన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్‌లు రాజ, కవిరాజతోపాటు వైసీపికి చెందిన సుమారు 250 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే 20వ డివిజన్ పరిధిలో టీడీపీ కార్పొరేటర్ అశోక్, జిల్లా తెలుగుయువత కార్యదర్శి రాహుల్, క్రిస్టియన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు డేవిడ్ బిర్లా ఆధ్వర్యంలో ఇరువారం, హౌసింగ్ కాలనీ, పీహెచ్ కాలనీలోని వైసీపీకి చెందిన సుమారు 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లోనే ఉన్నా కనీస వసతులైన తాగునీరు, డ్రైనేజి, వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తమ డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేశారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గురు జాల జగన్మోహన్, ఎంపీగా దగ్గుమళ్ళ ప్రసాదరావును గెలిపించుకుంటామని చెప్పారు. టీడీపీలోకి చేరిన వారికి గురజాల జగన్మోహన్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

23వ డివిజన్ పరిధిలో...

టీడీపీని గెలిపించండి... రాష్ట్రాభివృద్ధికి బాటలు వేయండని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి గురజాల ప్రతిమ కోరారు. సోమవారం ఆమె నగరంలోని 23వ డివిజన్ పరిధి జానకారపల్లి, టెలిఫోన్ కాలనీ, అంబేద్కర్ వీధి ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ, ఐఐటీ, నవోదయ, కేంద్రీయ విశ్వవిద్యాలయం తదితరాలను ఏర్పాటు చేసి విద్యాప్రమాణాలను మెగురుపరుస్తామఅన్నారు. అసంపూర్తిగా ఉన్న అడవిపల్లి రిజర్వాయర్ పనులను పూర్తిచేసి నగర ప్రజలకు శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజి ఏర్పాటు చేసి, ప్రభుత్వాసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● అలాగే చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు తనయుడు సీకే సాయికృష్ణారెడ్డి నగరంలోని 44వ డివిజన్‌లోని శివాలయం, వీరభద్రకాలనీ, బజారువీధి, మార్కెట్ చౌక్‌లో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అప్రజాస్వామిక పాలన సాగిస్తున్న వైసీపీని ఇంటికి సాగనంపాలని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జయకుమార్, వెంకటేష్ ఆచారి, అత్తు, మోహన్, షేరు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో ప్రైవేట్ ప్రభంజనం





విద్యార్థులను అభినందిస్తున్న విజయం అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి, విజ్ఞానదీప్తి స్కూల్, ప్రకాశం స్కూల్

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 22: విద్యాశాఖ సోమవారం విడుదల చేసిన టెన్త్ ఫలితాల్లో స్థానిక విజయం పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజా మూర్తి తెలిపారు. ఎ.శృతి 591 మార్కులు, సాయి పూజిత, కె.లోకేష్ 584, యోషికా చౌదరి 579 , ఎం.సుచికారెడ్డి 578 మార్కులు సాధించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక రాంనగర్ కాలనీలోని హార్వర్డ్ స్కూల్‌లో వందశాతం ఫలితాలు సాధించగా, జి.నందు యాదవ్ 549 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ భాస్కర్ తెలిపారు. పోషణప్రియ 544, శిరీషా 543, మేఘన 534 మార్కులు సాధించగా, మరో 19 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. స్థానిక విజ్ఞానదీప్తి స్కూల్లో సి.గీత 592 మార్కులు సాధించి పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచినట్లు కరస్పాండెంట్ ప్రకాష్ చంద్రారెడ్డి తెలిపారు. పి.జాహ్నవి 590, ఈష 589, శరణ్య 583, శ్రీఖర్ 582, తేజస్వీ 579, కీర్తన 568 మార్కులు సాధించగా, 550 మార్కులకు పైగా 23 మంది, 500 మార్కులకుపైగా 68 మంది సాధించినట్లు తెలిపారు. వీరిని హెచ్ఎం త్యాగరాజులు, మహీధర్‌రెడ్డిలు అభినందించారు. స్థానిక ప్రకాశం స్కూల్లో పి.నరేష్ 584 మార్కులు, హరిని, రిహాన్‌లు 582, అభినవ్, తిరుమలేష్‌లు 581 మార్కులు సాధించినట్లు హెచ్ఎం షిరాజ్ బాషా తెలిపారు. స్థానిక దేవీ స్కూల్లో వంద శాతం ఉత్తీర్ణత కాగా రితీష్ 556 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ ప్రసాద్ తెలిపారు. శ్రీచైతన్య స్కూల్లో వి.మానస్ క్రిష్ణ 595 మార్కులు, సుష్మశ్రీ 593, లాస్య 590 మార్కులు సాధించినట్లు ఏజీఎం సురేష్ తెలిపారు స్థానిక నారాయణ విద్యా సంస్థలో సి.మోక్షిత 586, శామ్యూల్ 570 మార్కులు సాధించగా, వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటరత్నం తెలిపారు.

ప్రజలను మోసగించిన వైసీపీకి బుద్ధి చెప్పండి

వడమాలపేట, ఏప్రిల్ 22: ఒక్కచాన్స్ అంటూ ప్రజలను మోసానికి గురిచేసిన వైసీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మణిరాజు కోరారు. సోమవారం క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో వడమాలపేట మండలం ఏఎం పురంలో టీడీపీ మ్యానిఫెస్టోను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్‌ను త్యధిక మెజారిటీతో గెలపించాలంటూ ఇంటింటా ప్రచారం చేశారు. ఎన్‌డీఏ కూటమి అధికారం చేపడితేనే రాష్ట్ర భవిష్యత్తు బాగా పయనిస్తుందని ప్రజలకు వివరించారు. ప్రచారంలో క్షత్రియ సంఘం నాయకులు అబ్బరాజు, రామ్మోహన్ రాజు, సుబ్రమణ్యం రాజు, రాజేంద్రరాజు, జయదేవ రాజు, రఘురాజు, సీపీ కృష్ణమరాజు, బాబురాజు, కోనేటి రవిరాజు, వెంకటేష్, శ్యామ్, మణి తదితరులు పాల్గొన్నారు.



ఏఎంపురంలో ప్రచారంలో క్షత్రియ సంఘ నాయకులు

అట్టహాసంగా పూతలపట్టు టీడీపీ అభ్యర్థి నామినేషన్




నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన కార్యకర్తలు, నామినేషన్ పత్రాలు అందిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్

పూతలపట్టు, ఏప్రిల్ 22: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్ నామినేషన్ కార్యక్రమం సోమవారం అట్టహాసంగా జరిగింది. నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిమంది తరలివచ్చారు. సోమవారం ఉదయం 9 గంటలకే రంగంపేట క్రాస్‌రోడ్డు ఫ్లైఓవర్ వద్దకు నాయకులు, కార్యకర్తలు తమతమ వాహనాల్లో అక్కడికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఒక కిలోమీటరు దూరంలో వున్న పూతలపట్టుకు చేరుకోవడానికి ఉదయం 11 గంటలకు బయలుదేరిన ర్యాలీ రెండు గంటల సమయం పట్టింది. ఒంటి గంటల సమయంలో ఆయన నియోజకవర్గానికి చెందిన నాయకులతో కలిసి రిటర్నింగ్ అధికారి చెన్నయ్యకు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌ల అడుగుజాడల్లో నడిచి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ నేత యువరాజులు నాయుడు, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జీడీ నెల్లూరులో నలుగురు అభ్యర్థుల నామినేషన్లు



ఆర్వోకు నామినేషన్ ఫారాన్ని అందజేస్తున్న రవికుమార్

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 22: గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి నలుగురు అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.వెంకటశివ తెలిపారు. నాల్గవరోజు సోమవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం దళితవాడకు చెందిన పి.రవికుమార్, అఖిల భారత జనసంఘ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గంగాధరనెల్లూరు మండలం పాచిగుంట దళితవాడకు చెందిన వి.రామరాజు, బహుజన సమాజ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గంగాధరనెల్లూరు మండలం పెడకంటిపల్లె దళితవాడకు చెందిన పి.భాస్కర్, ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తిరుపతి జిల్లా దుర్గసముద్రం దళితవాడకు చెందిన కె.రాము నామినేషన్లు అందజేశారని చెప్పారు. అనంతరం టీడీపీ సీనియర్ నేత గ్యాస్ రవికుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు నామినేషన్ వేసినట్లు చెప్పారు. తానేమి డాక్టర్ థామస్‌కు వ్యతిరేకికానని, అధిష్టానం ఏవిధంగా ఆదేశిస్తే తాను పోటిస్తానని వివరించారు.

ఇండిపెండెంటు అభ్యర్థిగా నారాయణస్వామి నామినేషన్

నగరి : నగరి నియోజకవర్గ ఇండిపెండెంటు అభ్యర్థిగా పుత్తూరు పట్టణానికి చెందిన నారాయణస్వామి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నగరి నియోజకవర్గానికి ఇప్పటివరకు ఐదుగురు నామినేషన్లు వేశారు.

టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర కమిటీ నియామకం

చిత్తూరు సిటీ/వెదురుకుప్పం, ఏప్రిల్ 22: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు సోమవారం టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర కమిటీ (అదనపు) నియమించారు. అందులో జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది అందులో పార్టీ ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వెంకటేష్ (కుప్పం) రాష్ట్ర కార్యదర్శిగా పెనుమూరు మండలం చిన్నకావూరివారిపల్లికి చెందిన ఎంపరాల కుమారస్వామి నియమితులయ్యారు.

వెన్నకృష్ణుడి అలంకారంలో శ్రీరాముడు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 22: స్థానిక కోదండరామాలయంలో తొమ్మిది రోజులుగా శ్రీరామనవమి ఉత్సవాలు రమణీయంగా జరుగుతున్నాయి. సోమవారం పల్లకిలో వెన్నకృష్ణుడి అలంకారంలో పురవీధులో ఊరేగి భక్తులను తన్మయ పరిచారు. మధ్యాహ్నం ఆలయం ఎదుట స్వామి అమ్మవార్ల వయ్యాళి సేవ నిర్వహించారు. సాయంత్రం అశ్వవాహన సేవ, దోపు ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో సుబ్రమణ్యంనాయుడు, అర్చకులు వేణుగోపాల్, డాక్టర్. ఎస్‌టి రంగనాథన్, వీహెచ్‌పీ నాయకులు వేలు, మురళి పాల్గొన్నారు.

26 నుంచి గరికపాటి ప్రవచనాలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 22: స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ఈనెల 26 నుంచి మూడు రోజులపాటు ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావుచే ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గో మహాలక్ష్మి ట్రస్ట్ నిర్వాహకులు చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. భక్త చింతామణి శతకంపై గరికపాటి ప్రవచనాలు నిర్వహిస్తారని తెలిపారు.

వడదెబ్బపై అవగాహన

యాదమరి, ఏప్రిల్ 22: ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఆయన దిగువగుట్టకింద హరిజనవాడలోని దళితులకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, గొర్రెల కాపరులు ఉదయం 10 గంటలకల్లా పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. ఎవరికైనా ఇబ్బందిగా ఉంటే వెంటనే ఓఆర్ఎస్‌ను తీసుకోవాలన్నారు. తాగిన తరువాత కూడా నీరసంగా ఉంటే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

విజయపురం, ఏప్రిల్ 22: మండలంలోని విజయపురం, మాధవరం గ్రామాల వలంటీర్లు సోమవారం ఎంపీడీవో బ్రహ్మయ్యకు రాజీనామా లేఖలు సమర్పించారు. మొత్తం 10మంది తమ రాజీనామా చేశారు.

రూ.1.50 లక్షల నగదు పట్టివేత

గుడిపాల, ఏప్రిల్ 22: చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో సోమవారం సరైన బిల్లులేని రూ.1.50 లక్షల నగదును చెక్‌పోస్టు అధికారులు పట్టుకున్నట్లు తనిఖీ అధికారి గణపతి తెలిపారు. తిరువణ్ణామలై నుంచి చిత్తూరు వైపు వస్తున్న ఈచర్ వాహనాన్ని తనిఖీ చేయగా డ్రైవర్ వద్ద వున్న బిల్లుల్లేని నగదును స్వాధీనం చేసుకున్నారు.

నేడు గుడిపాల మండల మీట్

గుడిపాల, ఏప్రిల్ 22: గుడిపాల మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సమగ్ర నివేదికలతో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం



కార్వేటినగరం, ఏప్రిల్ 22: కార్వేటినగరం మండలం ఆర్‌కేవీబీపేట పంచాయతీలో జీడీ నెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డి.రమేష్‌బాబు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి ఎం.గోవర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దినకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కుంభాభిషేకం

నింద్ర, ఏప్రిల్ 22: మండలంలోని కూనమరాజు పాలెంలో వెలిసిన మహాలక్ష్మి ఆలయంలో సోమవారం కుంభాభిషేక వేడుకలు వైభవంగా జరిగింది. ఉదయం మహా పూర్ణాహుతి, కలశ పూజ, ఆలయ ప్రదక్షిణం, విమాన గోపుర మహా సంప్రోక్షణ, మహాభిషేకం జరిగింది. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రుక్మిణి కల్యాణం జరిగింది. సాయంత్రం ఉత్సవ మూర్తులను ఊరేగించారు. మంత్రి ఆర్‌కే రోజా, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ చక్రపాణి రెడి, ఆలయ ధర్మకర్త పుండరీక వరదానందాస్వామి, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

24న జీజేఎం నామినేషన్‌ను విజయవంతం చేయండి

గుడిపాల, ఏప్రిల్ 22: ఈనెల 24వ తేది చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు బుధవారం ఉదయం 9 గంటలకు నామినేషన్ వేస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, కార్యదర్శి కిట్టు కోరారు. మండలంలోని టీడీపీ కుటుంబసభ్యులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

తవణంపల్లె ఎంపీపీగా ప్రతాప్‌సుందర్ బాధ్యతల స్వీకరణ



తవణంపల్లె, ఏప్రిల్ 22: తవణంపల్లె ఎంపీపీగా ప్రతాప్ సుందర్ రాయల్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎంపీపీగా ఉన్న గీత రాజీనామా చేయడంతో ఆమె స్థానంలో మల్లకుంట ఎంపీటీసీ, ప్రస్తుత వైస్ ఎంపీపీ ప్రతాప్ సుందర్ రాయల్‌రెడ్డిని నియమిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు.

24నుంచి భగవద్గీత శిక్షణ తరగతులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 22: స్థానిక బ్రాహ్మణవీధి గీతా సంఘం కార్యాలయంలో ఈనెల 24 నుంచి జూన్ 2 వరకు విదార్థులకు భగవద్గీత తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. భగవద్గీతతో పాటు విష్ణు సహస్రనామ స్తోత్రమ్ కూడ శిక్షణ ఇస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా ద్రౌపదీ కల్యాణం



వెదురుకుప్పం, ఏప్రిల్22: వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవ గ్రామంలోని ద్రౌపది అమ్మవారి ఆలయంలో మహా భారతం ఉత్సవాలను పురస్కరిం చుకుని సోమవారం ద్రౌపది కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ద్రౌపది అమ్మవారు పెళ్లికూతురైంది. పంచ పాండవులు పెళ్లి కుమారులయ్యారు. ఈ క్రమంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యనిర్వాహకులు బోడిరెడ్డి మోహన్‌రెడ్డి, బోడిరెడ్డి తారక్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఐరాలలో 5 పాఠశాలల్లో వందశాతం ఫలితాలు

ఐరాల : ఐరాల మండలంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు ఐదు. ఇందులో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఫైపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్, పుత్రమద్ది జడ్పీ హైస్కూల్, నాంపల్లె జడ్పీ హైస్కూల్, పొలకల జడ్పీ హైస్కూల్ , సమత ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టి. బిందుసాయి(587), ఎం.ఫైపల్లె జడ్పీ హైస్కూల్‌లో కేధారినాథ్(571), పుత్రమద్దిలో రోహిత్(575) మార్కులు సాధించారు. ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన బిందుసాయిని ఎంఈవో దామోదర్‌నాయుడు, ఉపాధ్యాయులు సన్మానించారు.

బంగారుపాళ్యం : మండలంలో ఉషోదయ హైస్కూల్‌కు చెందిన ప్రవీణ్ రాజ్ 593మార్కులు సాధించాడు, అదే పాఠశాలకు చెందిన నవదీపిక 584 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలవగా మేరీ ఇంగ్లీష మీడియం స్కూల్ విద్యార్థి అశ్వంత్ 581 మార్కులు, మంగళంపల్లె, నల్లంగాడు, తంబుగానిపల్లె ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణతను సాధించినట్లు తెలిపారు.

పుత్తూరు : పుత్తూరు ప్రభుత్వ బాలికల పాఠశాలలో 582 మార్కులతో మార్లియా ప్రథమ స్థానం, రాచపాలెం పాఠశాలకు చెందిన నితీష్, రేవతి ఇద్దరు విద్యార్థులు 578 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు.

నింద్ర : కొత్తఆరూరు ఉన్నత పాఠశాలకు చెందిన రమ్యశ్రీ 573 మార్కులు సాధించినట్లు ఎంఈవో శ్రీధర్‌రాజు, వసుమతిదేవి తెలిపారు., చవరంబాకం ఉన్నత పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

కార్వేటినగరం : కార్వేటినగరం ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన యశ్వంత్ 588 మార్కులు, కార్వేటినగరం లక్ష్మీనరసింహ విద్యాసంస్థకు చెందిన వాసవి 582 మార్కులు సాధించారు.

గుడిపాలలో మూడు స్కూళ్లలో వందశాతం

గుడిపాల : మండలంలోని బొమ్మసముద్రం పాఠశాలలో 56 మంది విద్యార్థులకు గాను 56 మంది, కమ్మతిమ్మాపల్లి పాఠశాలలో 41 మందికి గాను 41 మంది ఉత్తీర్ణులు కాగా, ఏఎల్‌పురం పాఠశాలలో 31 మందికి గాను 31 మంది ఉత్తీర్ణులయ్యారు. గట్రాళ్ళమిట్టకు చెందిన సోఫియా 579 మార్కులతో మొదటిస్థానం నిలిచారు.

విజయపురంలో 2 స్కూళ్లలో నూరు శాతం

విజయపురం : మండలంలోని జంబాడ, విజయపురం ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈవో ఆంజనేయులు తెలిపారు. విజయపురం పాఠశాల విద్యార్థిని జశ్విత 572 మార్కులు, జంబాడ విద్యార్థిని దాక్షాయణి 571 మార్కులు, శ్రీహరిపురం విద్యార్థిని మోనీషా 570 మార్కులు సాధించారన్నారు.

తవణంపల్లెలో 4 స్కూళ్లలో వంద శాతం

తవణంపల్లె : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అరగొండ బాలికోన్నత పాఠశాలలో 50 మందికి 50 మంది ఉత్తీర్ణత సాధించగా, తొడతర ఉన్నత పాఠశాలలో 38 మందికి 38 మంది ఉత్తీర్ణులు కాగా, కృష్ణాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 16 మందికి 16 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వెంగంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 9 మందికి 9 మంది ఉత్తీర్ణులయ్యారు.

శ్రీరంగరాజపురం : ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లెమిట్ట ఉన్నత పాఠశాల కు చెందిన కె. స్వాతి 586 మార్కులు సాధించారు.

నగరి: సత్రవాడ ఉన్నత పాఠశాల విద్యార్థి బీ.జే.కార్తీక 580మార్కులతో ప్రథమస్థానం, అదే పాఠశాలకు చెందిన సంతోష్, తమిళసెల్వన్‌లు 577 మార్కులు సాధించి రెండవస్థానంలో నిలిచారని ఎంఈవో నమశ్శివాయ తెలిపారు. కొత్తపేట తమిళ పాఠశాలకు చెందిన శరణ్య 576 మార్కులతో తృతీయ స్థానం సాధించారు.

వెదురుకుప్పం : నల్లవెంగనపల్లి పంచాయతీ మిట్టూరు గ్రామానికి చెందిన స్నేహిత్‌సాగర్ 584 మార్కులు వచ్చాయని ప్రకటించారు.

వడమాలపేట : సీతారామపురం ఉన్నత పాఠశాల వందశాతం సాధించింది. 22 మంది పరీక్షలు రాయగా 22 మంది ఉత్తీర్ణులయ్యారు.

వెదురుకుప్పం : దేవళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో-1 మహేశ్వరరావు, ఎంఈవో-2 దామోదరం తెలిపారు.

రెండు జడ్పీ హైస్కూల్స్‌లో వందశాతం ఫలితాలు

గంగాధరనెల్లూరు : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో గంగాధరనెల్లూరు మండలంలోని పెడకంటిపల్లె, బాలగంగనపల్లె జడ్పీ హైస్కూల్స్, గంగాధరనెల్లూరు సమీపంలో గల బాలికల గురుకుల పాఠశాల స్కూల్లో వందశాతం ఫలితాలు సాధించారని ఎంఈవోలు కాణిపాకం ఆంజినేయులుశెట్టి, గుణశేఖర్ రెడ్డిలు తెలిపారు. మండలంలోని నెల్లేపల్లె హైస్కూల్లో చదువుతున్న పి.శివకు 583 మార్కులతో మొదటిస్థానం, ఎం.యశ్వనకు 579 మార్కులతో రెండవ స్థానం, జె.భవ్యశ్రీకి 578 మార్కులతో మూడవస్థానంలో నిలిచారని చెప్పారు.

చిత్రలేఖన పోటీల్లో బంగారు, రజక పతకాలు



యాదమరి, ఏప్రిల్ 22: చిత్రలేఖన పోటీల్లో యాదమరి ఉన్నత పాఠశాల విద్యార్థులు బంగారు, రజక పతకాలను సాధించారు. విజయవాడ డ్రీమ్ చిల్డ్రన్స్ అకాడమి వారు మార్చిలో జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కీర్తన, సోని హారిక, పూజిత, లహరి, మిస్బాలు బంగారుపతకాలను సాధిచారు. అలాగే వసీఫా జైనబ్, అనురాధ, రాహుల్, సుహానా, భవిత, కల్పన, జాహ్నవిలు రజక పతకాలను సాధించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఆర్ట్ మాస్టర్ దామోదరాచారిని హెచ్ఎం గిరిరాజ, ఉపాధ్యాయులు అభినందలు తెలిపారు.

ఉదయం వైసీపీలో...రాత్రి టీడీపీలో చేరిక



టీడీపీ కండువా కప్పుకుంటున్న మునికృష్ణారెడ్డి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 22: మండలా నికి చెందిన టీడీపీ నేత మునికృష్ణారెడ్డి ఉదయం డిప్యూటీ సీఎం సమక్షంలో వైసీపీలో చేరి ఆ పార్టీ కండువా కప్పుకోగా, అదేరోజు రాత్రి మళ్ళీ టీడీపీ కండువా కప్పుకున్న ఘటన చోటుచేసుకుంది. గంగాధరనెల్లూరు మండ లం నెల్లేపల్లెలో సోమవారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. ఆ సమయంలో వెంకటాపురానికి చెందిన మునికృష్ణారెడ్డి వైసీపీ కండువా కప్పుకున్నారు. అయితే అదేరోజు రాత్రి వెంకటాపురంలో టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నెల్లేపల్లె మాజీ సర్పంచ్ పుష్పరాజ్ సమక్షంలో మళ్ళీ టీడీపీ కండువా కప్పుకున్నాడు.

వైద్యరంగంలో ఫిజియోథెరపీ కీలకం



విద్యార్థులకు వైట్‌కోట్ బహుకరిస్తున్న ఆధ్యాపకులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 22: వైద్య రంగంలో ఫిజియోథెరపీ ఒక కీలక పాత్ర పోషిస్తోందని అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వినోద్ భట్ అన్నారు. సోమవారం చిత్తూరులోని అపోలో కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీలో వైట్ కోట్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వినోద్ భట్ మాట్లాడుతూ రోగికి శస్త్రచికిత్స అనంతరం కోలుకోవడానికి ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులక వైట్ కోట్‌ను బహూకరించారు. కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ డీన్ కైలాసనాథ్, ప్రిన్సిపల్ రాజ్ ప్రసన్న, వైస్ ప్రిన్సిపల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.